


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 16.07.2026 | సంపుటి : 3 | సంచిక: 164 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 16.07.2026 | VOLUME : 3 | ISSUE : 164 | PAGES: 8 | COST: 2/- |

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

## ఆదిలాబాద్ సీసీఐని వెంటనే తెరిపించాలి

- కేంద్ర మంత్రి కుమారస్వామికి బీఆర్ఎస్ నేతల విజ్ఞప్తి
- వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపాలి
- సీసీఐ తెరిచేదాకా బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



## హెల్త్ కార్డుల పంపిణీ కూడా జూటాయే

- డేట్లు, డెడ్‌లైన్లు మారుతున్నాయి.. కార్డుల జారీ లేదు
- ప్రీమియం వసూలు చేసి పథకం అమలు చేయకపోవడం మోసమే
- బీఆర్ఎస్ నేత హరీష్‌రావు ఫైర్

3






# రాష్ట్రాన్ని అభివృద్ధికి నమూనాగా నిలుపుతాం

- అందుకే 2047 తెలంగాణ రైజింగ్ పాలసీకి రూపకల్పన
- 2034 నాటికి అమెజాన్ రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టాలి
- అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపనలో సీఎం రేవంత్

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

రాష్ట్రాన్ని అభివృద్ధికి నమూనాగా నిలపాలనే ఆలోచనతో తెలంగాణ రైజింగ్ పాలసీ రూపొందించామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యసాధనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి పెట్టుబడులు, ఉద్యోగ కల్పన కీలకం అని, ఇందులో భాగంగా పరిశ్రమల కల్పనకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు, అనుమతులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బుధవారం శంకుస్థాపన

మిగతా 2వ పేజీలో..

## విద్యలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం



2

## హైడ్రా టార్గెట్ కేటీఆరా?

- మాజీ మంత్రి సన్నిహితులపైనే ఫోకస్?
- ఆ దూకుడు వెనుక రాజకీయ కోణం?
- బడా ప్రాజెక్టులపై చర్యలతో జోరుగా చర్చ
- ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రాజెక్టులపై హైడ్రా చర్యలు
- రాజకీయ, ఆర్థిక కోణాలపై ఊహాగానాలు
- కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నారనే ప్రచారం

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల తొలగింపు లక్ష్యంగా హైడ్రా చేపడుతున్న చర్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఇటీవల నగరంలోని కొన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలకు చెందిన ప్రాజెక్టులపై వరుసగా చర్యలు చేపట్టడంతో, వాటి వెనుక కేవలం చట్ట అమలేనా, లేక రాజకీయ కోణం కూడా ఉందా అనే చర్చ రాజకీయ, రియల్ ఎస్టేట్ వర్గాల్లో జోరుగా

మిగతా 2వ పేజీలో..






## బాలికపై గ్యాంగ్‌రేప్ కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

- బాధితురాలికి రూ.12 లక్షల పరిహారం
- ఒక్కో నిందితుడికి రూ.20 వేల జరిమానా
- జగిత్యాల ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు కీలక తీర్పు

**జగిత్యాల, రాజముద్ర న్యూస్:**

మహిళలు, చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలిచే తీర్పును జగిత్యాల ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక పోక్సో

మిగతా 3వ పేజీలో..

## షాబాద్ హత్యలపై పవన్ ఆవేదన

- రేవంత్ రెడ్డికి లేఖ.. పోక్సో చట్టం కఠిన అమలుకు విజ్ఞప్తి
- బాధితులకు పూర్తి భద్రత కల్పించాలని సూచన
- పోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పిలుపు
- ముందస్తు బెయిల్, భద్రతా లోపాలపై ఆందోళన వ్యక్తం

2





## స్వరాష్ట్ర సాధనలో సరిహద్దు జిల్లాలది కీలక పాత్ర

- ఉత్తర తెలంగాణ జిల్లాల ఉద్యమకారులతో 'కమిటీ' ముఖాముఖి

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఉద్యమకారులు స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించారని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు

మిగతా 2వ పేజీలో..




## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గడువు పొడిగింపు


- తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం
- ఆగస్టు 3 వరకు ఇంటింటి సర్వే, దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్‌లో తుది ఓటర్ల జాబితా విడుదల
- నకిలీ, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపుపై దృష్టి


2

## హుస్సేన్ సాగర్ ప్రాజెక్టులో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఊరట

- యథాతథ స్థితి కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశం
- ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణంపై వివాదం
- తదుపరి ఉత్తర్వుల వరకు బలవంతపు చర్యలు వద్దన్న ధర్మాసనం
- కౌంటర్ దాఖలు చేయాలని జీహెచ్ఎంసీకి ఆదేశం

3






## పాతబస్తీ ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ దుమారం

- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణతో పాతబస్తీలో ఆందోళన
- ధ్రువీకరణ పత్రాల నిబంధనలపై ఎంఐఎం అభ్యంతరం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం
- ఓటర్ల జాబితా మార్పులపై రాజకీయ వర్గాల్లో చర్చ
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హైదరాబాద్ పాతబస్తీలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఓటర్ల వివరాల పరిశీలనలో భాగంగా అధికారులు అదనపు ధ్రువీకరణ పత్రాలు కోరుతుండటంతో పలువురు ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని

మిగతా 3వ పేజీలో..



## భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- 80 తులాల బంగారం, 5.5 కిలోల వెండి స్వాధీనం..
- 63 కేసుల నిందితుడు అరెస్ట్
- దుబ్బాక పోలీసుల సక్సెస్
- ప్రత్యేక బృందాలను అభినందించిన సీపీ రష్మి

**జగిత్యాల, రాజముద్ర న్యూస్:**

సిద్దిపేట జిల్లా దుబ్బాక పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన భారీ చోరీ కేసును సిద్దిపేట పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. సుమారు 80 తులాల బంగారం, 5.5 కిలోల వెండి, నగదును

మిగతా 2వ పేజీలో..

# రాష్ట్రాన్ని అభివృద్ధికి నమూనాగా నిలుపుతాం

**మొదటిపేజీ తరువాయి**

చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలకు మంచి ప్రోత్సాహకంగా ఉపయోగపడనుందన్నారు. ఫ్యూచర్ సిటీలో అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మించాలని ఫార్చ్యూన్500 కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడానికి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను 2025 డిసెంబర్‌లో నిర్వహించామని గుర్తు చేశారు. 2034 నాటికి అమెజాన్ సంస్థ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అమెజాన్ సంస్థ పెట్టుబడులకు సంబంధించి ప్రతి నెలా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామంటూ తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించాలని అమెజాన్‌కు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. పరిశ్రమలు, పర్యాటకం, ఎనర్జీ, ఆరోగ్యం, స్పోర్ట్స్ వంటి రంగాల్లో నిర్దిష్టమైన పాలసీలు రూపొందించామని, ఉద్యోగ కల్పన కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వివరించారు. అమెజాన్ లాంటి సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తే ఆ ప్రాంతాల్లో ఇతర కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడుతుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని, ఉద్యోగావకాశాలు కల్పనతోపాటు కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని, నగరంలో ఉన్న పరిశ్రమలను తరలించే అవసరం ఉందని, మూసీ నది ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ చేయాల్సి ఉందని తెలిపారు. మూడు లక్షల ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని, నగరంలో డీజిల్ మీద ఆధారపడి నడుస్తున్న రెండు లక్షల ఆటోలను రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయని, ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్‌కు పన్నును పూర్తిగా మినహాయించి హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించామని, అభివృద్ధిలో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు.

**ఈ ప్రాంత రైతులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా**

రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల కోస భూములను త్యాగం చేసిన రైతులను ఎప్పటికీ ప్రభుత్వం గుర్తు పెట్టుకుంటుందన్నారు. భవిష్యత్ తరాలకు ఒక అద్భుతమైన నగరాన్ని నిర్మించడానికి ముందుకొచ్చి సహకరించిన వారిని అభినందిస్తూ చిన్నచిన్న సమస్యలను పరిష్కరించుకుంటూ అవసరమైన నష్ట పరిహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. భూమి ఇచ్చి అభివృద్ధికి సహకరించిన రైతులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆందోళనలు చేపడుతున్న రైతులతో చర్చించాలని మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మా రెడ్డిలకు సూచిస్తున్నానంటూ భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, మంచి నష్ట పరిహారాన్ని అందించాలని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్ర సాధనలో సరిహద్దు జిల్లాలది కీలక పాత్ర

**మొదటిపేజీ తరువాయి**

కమిటీ సభ్యులు కొనియాడారు. అమరవీరుల స్మారక చిహ్నం(అమరదీపం)లో ఉత్తర తెలంగాణ జిల్లాల పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో కమిటీ బుధవారం ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. నాడు వివక్షకు వ్యతిరేకంగా అడవి బిడ్డలు మొదలుకుని పట్టణ ప్రాంత ప్రజలు, విద్యార్థి లోకం, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు సరిహద్దు జిల్లాల్లో రహదారులను స్తంభింపజేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారని, ఆనాటి పోరాట పటిమే నేటి స్వరాష్ట్ర ఆవిర్భావానికి బలమైన పునాది అని కమిటీ స్పష్టం చేసింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు, సభ్యుడు ప్రొఫెసర్ ఎమ్.కోదండ రామ్, కార్యవర్గ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్.రాములు నాయక్ తదితరులు హాజరై, సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల సలహాలను, సూచనలను, నాటి ఉద్యమ ఆధారాలను పరిశీలించారు.

**ఉద్యమకారులు సమర్పించిన ప్రధాన వినతులు**

నాలుగు జిల్లాల ప్రతినిధులు, క్షేత్రస్థాయి యోధులు తమ భవిష్యత్తుకు రక్షణ కల్పించాలని కోరుతూ కమిటీ ముందు తమ ప్రధాన డిమాండ్లను ఉంచారు. 250 గజాల నివాస స్థలం సొంత ఇల్లు లేని అర్హులైన ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి 250 గజాల భూమిని ఉచితంగా కేటాయించి రిజిస్ట్రేషన్ చేయించాలి. వృద్ధాప్యంలో ఎవరిపైనా ఆధారపడకుండా, సమాజంలో ఆత్మగౌరవంతో జీవించడానికి గౌరవప్రదమైన నెలవారీ జీవితకాల పెన్షన్ అందించాలి. నాటి పోరాటంలో చదువులు, ఉద్యోగావకాశాలు కోల్పోయిన ఉద్యమకారుల పిల్లలకు విద్యా సంస్థల అడ్మిషన్లలో, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా కల్పించాలి. ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న మహిళా పోరాట యోధులకు ప్రత్యేక స్వయం ఉపాధి పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. అన్ని ప్రభుత్వ, గుర్తింపు పొందిన కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉచితంగా వైద్య సేవలు పొందేందుకు వీలుగా ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయాలి. గుర్తింపు పొందిన ఉద్యమకారుల పిల్లలకు లేదా వారి తదుపరి తరానికి కేజీ నుండి పీజీ వరకు పూర్తి ఉచిత విద్యను అందించాలి. వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులందరికి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో జీవితకాల ఉచిత ప్రయాణ రవాణా పాస్ సౌకర్యం కల్పించాలి.


**కమిటీ సభ్యుల హామీ**

కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ పోరాట గడ్డల నుండి వచ్చిన ప్రతి ఒక్కరి ఆవేదనను, డిమాండ్లను కమిటీ సానుకూలంగా రికార్డు చేసుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సంక్షేమ అంశాలు ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదు.. మీ రక్తం, చెమట చిందించి సాధించుకున్న మీ ఆత్మగౌరవ హక్కు అని పేర్కొన్నారు. ఏ ఒక్క నిజమైన ఉద్యమకారుడికి అన్యాయం జరగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ, జూలై 15**

తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని స్పష్టం చేసింది. తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వేను ఆగస్టు 3 వరకు కొనసాగించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే గడువులోగా పూర్తి చేయనున్నారు. తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. తెలంగాణలో సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. అనంతరం పరిశీలన పూర్తి చేసి అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లో తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిర్వహించే ఇంటింటి సర్వేలో భాగంగా నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణ చేపట్టనున్నారు. సవరించిన గడువులను కచ్చితంగా అమలు చేయాలని ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.



# విద్యలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

- గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన విద్య
- పేద విద్యార్థులకు అన్యాయం చేశారు
- త్వరలో 9 రకాల విద్యా కిట్‌ల పంపిణీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**వనపర్తి, జులై 15:**

గతంలో రాష్ట్రంలో వెనుకబడిన విద్య స్థానాన్ని ప్రస్తుతం మెరుగుపరుచుకుంటూ ఒకటవ స్థానానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు, జిల్లాలోని కొత్తకోట ప్రభుత్వ బాలికల హై స్కూల్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసే సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనాడు ప్రతి ఒక్కరు మంచిగా చదువుకొని జిల్లా పేరు నిలబెట్టాలని ఆత్మగౌరవంతో బతకాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు ఆనందం పొందే విధంగా నాణ్యతమైన చదువు ఇప్పించాలని ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ లను మొదలుకొని ప్రభుత్వ పాఠశాలను మొత్తం నిర్లక్ష్యం చేసి పేద ప్రజలకు విద్యను దూరం చేసిన ఘనత గత ప్రభుత్వాన్నిదాని ఆయన అన్నారు. ఉదాహరణకు 44వ జాతీయ రహదారిపై ఉన్న కొత్తకోట బాలికల పాఠశాలను పట్టించుకోకుండా చెట్ల కిందనే చదువుకుంటున్నారని ఎన్నికల ముందు ఇది చూసిన ప్రస్తుత ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి నా దృష్టి తీసుకొచ్చిన వెంటనే నిధులు కేటాయించి పాఠశాల నిర్మాణం పూర్తిచేశామని ఆయన అన్నారు, గత ప్రభుత్వంలో పోల్చుకుంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో గతంలో 35, 36 స్థానంలో ఉన్న విద్య నేడు 18వ స్థానానికి తీసుకొచ్చిన ఘనత ఈ ప్రభుత్వం దక్కిందని ఈ ఘనత ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులదని ఆయన అన్నారు, ప్రస్తుతం 26 వేల పాఠశాలలో 18 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని 11000 ప్రైవేట్ పాఠశాలలో 32 వేల మంది విద్యార్థులే ఉన్నారని గత పది సంవత్సరాలలో పోల్చుకుంటే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు భారీగా చేరారని ఆయన అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికోసం ప్రభుత్వ టీచర్లనే విదేశాలకు పంపి విద్యపై అవగాహన కల్పించే విధంగా ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు, తెలంగాణలో 9 రకాల ఎడ్యుకేషన్ కిట్టు పంపిణీ చేస్తున్నామని ఆయన అన్నారు ప్రభుత్వ బడిలో మంచి చదువు అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చదవాలని ఒకవేళ ఎవరైనా అవహేళన చేస్తే ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలో చదివాడని ఉదాహరణ చూపెట్టాలని ఆయన అన్నారు మంత్రులు దూదిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిని కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి మంత్రులయాలని విద్యార్థులు ప్రతి ఒక్కరు గమనించాలని ఆయన అన్నారు ప్రభుత్వ పాఠశాల ఒక్కొక్క విద్యార్థికి సంవత్సరానికి 1, 8 వేల రూపాయలు ఖర్చు చేస్తుందని ఆయన అన్నారు, ప్రతి విద్యార్థి చదువులు ఉన్న రాణించాలి లేకపోతే మైదానంలో వెళ్లి క్రీడలలో రాణించాలని ఆయన విద్యార్థులను కోరారు చదువులో రాణించలేని సిరాజ్ ఏ ఉద్యోగానికి కూడా పనికిరాడు అని కానీ క్రీడలు రాణించినందుకు గ్రూపు వన్ జాబ్ ఇప్పించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి వారు కూడా చాలామంది ఉద్యోగాలు పొందాలని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల రాణిస్తే ఉద్యోగాలు పొంది తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలని ఆయన కోరారు..

**ఇంటి పేరు మార్చుకున్నా చదువును పట్టించుకోలేదు**

వనపర్తి జిల్లాలో ఒక మాజీ ప్రతినిధి ఇంటి పేరు నీళ్లు అని మార్చుకున్నాడు కానీ గతంలో చదువులు మాత్రం పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి అన్నారు, నేను ఈ జిల్లాలో నే బాల్య జీవితం గడిపానని జిల్లాలో ఉన్న సమస్యలని తనకు తెలుసని అన్ని సమస్యలు పరిష్కరిస్తానని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు. జూపల్లి కృష్ణారావు. వాకిటి శ్రీహరి. ఎంపీ మల్లు రవి. ఎమ్మెల్యేలు జి.మధుసూదన్ రెడ్డి మెఘా రెడ్డి కుచ్చుకుల రాజేశ్వర్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి. శివసేన రెడ్డి. సరిత తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

**చైనాతో 'అమర రాజా' పోటీ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

మహబూబ్‌నగర్, ప్రజాతంత్ర, జూలై 15 : పాలమూరు జిల్లాను పారిశ్రామికంగా, ఆర్థికంగా అగ్రగామిగా నిలపడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలోని దివిటిపల్లిలో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఎనర్జీ బ్యాటరీ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మం త్రులు భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు, అమరరాజా సంస్థ చైర్మన్ గల్లా జయదేవ్, ఎండి విక్రమాదిత్యలతో కలిసి ముఖ్య మంత్రి బుధవారం ఘనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కాలుష్యం వేగంగా విస్తరిస్తోందని, వాతావరణంలో మార్పులు వేగంగా వస్తున్నాయని, ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలు పడక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కాలుష్యం తగ్గించుకోవాల్సిన అవసరం ఉందంటూ కాలుష్య నియంత్రలో ఈవీ వెహికిల్స్ అవసరం ఉందని అన్నారు. దివిటిపల్లి అమర రాజా యూనిట్‌లో 700మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఇందులో 400మంది మహిళా ఉద్యోగులు ఉండటం మహిళా సాధికారితకు నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వాల పాలసీల్లో ఉన్న మంచిని మేం ప్రోత్సహిస్తున్నామని, తమ ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా ఇండ్రస్ట్రియల్, టూరిజం, హెల్త్ ఇలా అనేక పాలసీలను వమ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో 5 శాతం తెలంగాణ వాటాగా ఉంది.. దీన్ని 10 శాతానికి పెంచడమే తమ లక్ష్యమని అన్నారు. అమర రాజా లాంటి సంస్థలు తెలంగాణ రైజింగ్‌కు మద్దతుగా ఉంటున్నాయన్నారు. తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్.. రాష్ట్రంలో మౌలిక సదుపాయలను మెరుగుపరుస్తున్నామని, తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి పాలసీలు రూపొందించి ముందుకు వెళ్తున్నామని సీఎం వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలంటే మౌలిక సదుపాయాలు ముఖ్యమని, పారదర్శకంగా విధానాలు రూపొందించుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు. తాను పాలమూరు బిడ్డను అని, ఆదర్శవంత జిల్లాగా మహబూబ్ నగర్‌ను తీర్చిదిద్దుతున్నామని, ఒకప్పుడు కరవు జిల్లాగా ఉండే మహబూబ్‌నగర్ ఇప్పుడు ఇతర జిల్లాలను దత్తత తీసుకునే స్థాయికి ఎదిగిందని చెప్పారు. విద్యలో భాగంగా ట్రిబుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు, ఏటీసీ సెంటర్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూల్స్ జిల్లాలో ఏర్పాటు చేశామని, బ్లూ కాలర్ జాబ్‌ల కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, బీమా, ఆర్డీఎస్, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని వివరించారు. త్వరలోనే ఈ జిల్లా ప్రజలకు శుభవార్త వినిపించనున్నామని. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీలు సాధించే దిశగా పక్క రాష్ట్రంతో చర్చలు జరుగుతున్నాయని, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీ కేటాయింపులపై చర్చలు జరుపుతున్నామని చెప్పారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం సృష్టించి జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పాలమూరు జిల్లాలో చాలామంది రైతులు అమర రాజాకు భూములు ఇచ్చారని, అత్యధిక ఉద్యోగాలు వాళ్లకు ఇవ్వాలని కోరుతున్నానని ఆ సంస్థ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఆర్ అండ్ బీ మంత్రిగా గల్లా జయ్‌దేవ్ తల్లి గల్లా అరుణ కొడంగల్‌లో చాలా రోడ్లు మంజూరు చేశారని, తాను రెండోసారి గెలవడానికి అవి ఉపయోగపడ్డాయని రేవంత్ గుర్తు చేసుకున్నారు.

# షాబాద్ హత్యలపై పవన్ ఆవేదన

**హైదరాబాద్, జూలై 15**

తెలంగాణ రాష్ట్రంలోని షాబాద్‌లో జరిగిన సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి బుధవారం లేఖ రాసిన ఆయన, పోక్సో చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు బాధితులకు పూర్తి భద్రత కల్పించేలా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

షాబాద్‌లో జరిగిన ఘటనను ప్రస్తావించిన పవన్ కల్యాణ్, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి 16 ఏళ్ల బాలికతో పాటు ఆమె తల్లి, నానమ్మను హత్య చేసి, అనంతరం తన భార్య, ఇద్దరు పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. ఈ సంఘటన వ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



పోక్సో కేసుల దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని కచ్చితంగా పాటించాలని, సాక్ష్యాధారాల పరిరక్షణకు పటిష్టమైన వ్యవస్థను అమలు చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. నిందితులకు చట్టపరమైన ప్రక్రియలో అనవసర అవకాశాలు లేకుండా చూడడంతో పాటు బాధిత కుటుంబాల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఈ కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన భద్రత కల్పించడంలో లోపాలు చోటుచేసుకున్నాయంటూ పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిన విషయాన్ని కూడా ఆయన తన లేఖలో ప్రస్తావించారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాల అమలు, బాధితుల రక్షణ, దర్యాప్తు వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని పవన్ కల్యాణ్ కోరారు.

# భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**మొదటిపేజీ తరువాయి**



స్వాధీనం చేసుకుని, 63 కేసుల్లో నిందితుడిగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగ చిక్కుడు కృష్ణ అలియాస్ వెంగలి బిక్షపతిని అరెస్టు చేశారు. పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ పర్యవేక్షణలో ఆరు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి దాదాపు 400 నుంచి 500 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుడి కదలికలను గుర్తించాయి. ముస్తాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, సికింద్రాబాద్, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో గాలింపు చేపట్టి చివరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం, దుబ్బాకకు చెందిన వ్యాపారి చింత రాజ్‌కుమార్ కుటుంబంతో కలిసి ఉత్తర భారతదేశ తీర్థయాత్రకు వెళ్లిన సమయంలో, జూన్ 28 అర్ధరాత్రి నిందితుడు ఇంటి కిటికీ ఊచలను ఇనుపరాడ్లు, టేకు దుంగలతో వంచి లోనికి ప్రవేశించాడు. అనంతరం ఇంట్లో ఉన్న తాళాలతో లాకర్‌ను తెరిచి బంగారం, వెండి, నగదు అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూన్ 29న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులు నిందితుడి వద్ద నుంచి 80 తులాల బంగారు ఆభరణాలు, 5.5 కిలోల వెండి ఆభరణాలు, రూ.1,300 నగదు, రోల్డ్ గోల్డ్ ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడిపై సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో కలిపి 63 చోరీ కేసులు నమోదైనట్లు వెల్లడైంది. ఇటీవల బాన్సువాడ చోరీ కేసులో జైలుశిక్ష అనుభవించిన సమయంలో జైలు వార్డర్‌తో ఏర్పడిన పరిచయంపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసును ఛేదించిన ఏసీపీ ఎం. రవీందర్‌రెడ్డి, సీసీఎస్ ఏసీపీ సదన్ కుమార్, సీసీఎస్ సీఐ జాన్‌రెడ్డి, సీఐలు రవీందర్, వాసుదేవరావు, ఎస్ఐ కీర్తిరాజు, హరీష్, దామోదర్‌తో పాటు సీసీఎస్, క్రైమ్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ అభినందించారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు**

ఇళ్లకు, వ్యాపార సముదాయాలకు తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఎక్కువ రోజుల పాటు ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇళ్ల కిటికీలు, ప్రధాన తలుపులకు బలమైన స్టీల్ భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

# హైడ్రా టార్గెట్ కేటీఆరా?

**మొదటిపేజీ తరువాయి**

సాగుతోంది. అయితే ఈ ప్రచారాలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

కొన్ని ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రాజెక్టులపై హైడ్రా చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఆ సంస్థలకు గత ప్రభుత్వ హయాంలో కీలక వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సన్నిహితంగా భావించే వ్యాపార వర్గాల ప్రాజెక్టులే లక్ష్యంగా మారుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు మద్దతుగా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఆధారాలు బయటకు రాలేదు.

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా చేసిన కొన్ని వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగంలో జరిగిన లావాదేవీలు, చెరువుల పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) పరిధుల్లో నిర్మాణాలకు సంబంధించిన అంశాలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతం రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలకే పరిమితమయ్యాయి.

రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, గతంలో వివాదాస్పదంగా మారిన కొన్ని ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపైనే చర్యలు తీసుకుంటున్నారని ఒక వర్గం చెబుతుండగా, గత పాలకులకు సన్నిహితంగా ఉన్న వ్యాపార వర్గాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని మరో వర్గం వాదిస్తోంది.

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మాత్రం హైడ్రా చర్యలు పూర్తిగా చట్టబద్ధమైనవేనని స్పష్టం చేస్తోంది. చెరువుల ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలపైనే చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో రాజకీయ ప్రమేయం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై వారి రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకుంటామని పలుమార్లు ప్రకటించారు.

ఇదిలా ఉండగా, హుస్సేన్ సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మాణాలకు సంబంధించిన కేసులో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు తెలంగాణ హైకోర్టు తాజాగా తాత్కాలిక ఊరట కల్పించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రాజెక్టుపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ యథాతథ స్థితిని కొనసాగించాలని ధర్మాసనం సూచించింది. దీంతో హైడ్రా చర్యలు, న్యాయపరమైన పరిణామాలు ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ప్రస్తుతం హైడ్రా తదుపరి చర్యలు ఎటువైపు సాగుతాయన్నదే ఆసక్తికరంగా మారింది. మరిన్ని ప్రముఖ ప్రాజెక్టులపై విచారణలు, చర్యలు కొనసాగుతాయా? లేక చట్టపరమైన ప్రక్రియల ఆధారంగా మాత్రమే నిర్ణయాలు తీసుకుంటారా? అన్నదానిపై రాజకీయ, రియల్ ఎస్టేట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వినిపిస్తున్న ఆరోపణలు, ప్రచారాలపై అధికారిక విచారణలు లేదా న్యాయపరమైన నిర్ధారణలు వెలువడాల్సి ఉంది.

# హెల్త్ కార్డుల పంపిణీ కూడా జూటాయే

హైదరాబాద్ జూలై 15 :

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఎంప్లాయిస్ హెల్త్ స్కీం విషయంలో రేవంత్ ప్రభుత్వం తీరు కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుంది అని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు ధ్వజమెత్తారు. రేవంత్‌కు హడావుడి ఎక్కువ.. అసలు విషయం తక్కువ అని, హెల్త్ కార్డులు ఇవ్వడంతోపాటు ఈరోజు నుంచే ఉచిత వైద్య సేవలు అందిస్తామని చెప్పిన మాటలు జూటా అని తెలిపోయిందని విమర్శించారు. పథకం అమలుకు మార్గదర్శకాల విడుదల లేదు.. నెట్‌వర్క్ హాస్పిటల్స్‌తో సంతృప్తికరమైన ఒప్పందం లేదు.. పథకం అమలు చేయకుండానే రెండు నెలలుగా ఉద్యోగుల జీతం, పెన్షన్ల నుంచి 1.5 శాతం కోత విధించిన సర్కారు పథకం అమలులో మాత్రం చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. అభయ హస్తం మేనిఫెస్టోలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల సంక్షేమం విషయంలో ఇచ్చిన హామీ 30 నెలలు గడుస్తున్నా నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌తో అన్ని రకాల జబ్బులకు, అన్ని హాస్పిటల్స్‌ల్లో వైద్యం అందించే విధంగా హెల్త్ కార్డులు జారీ చేస్తామన్న మాట నిలబెట్టుకోవడానికి ఇంకెంత సమయం కావాలి అని ఆయన ప్రశ్నించారు. ముందు జూన్ 2 నుంచి హెల్త్ స్కీం అమలు చేస్తాం అన్నారు.. తర్వాత జులై 15 నుంచి అన్నారు.. అతీ లేదు గతీ లేదు..డేట్లు, డెడ్ లైన్లు మారుతున్నాయి తప్ప హామీని మాత్రం లబెట్టుకోలేకపోతున్నారు అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమం పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమన్నారు. రాష్ట్ర ఏర్పాటులో, అభివృద్ధిలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాత్రను గుర్తించిన కేసీఆర్ రెండుసార్లు పీఆర్సీ, 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి గౌరవించారని, పెన్షనర్ల వయస్సు పెరుగుతన్నకొద్దీ వారి అవసరాలు తీరేలా పెన్షన్ పెంచారని, ఒక్క రూపాయి తీసుకోకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లకు వెల్‌నెస్ సెంటర్లు, ఇతర హాస్పిటల్స్ ద్వారా నాణ్యమైన వైద్య సేవలుందించారని వివరించారు. 1శాతం బేసిక్ పేతో మరింత పటిష్ఠంగా ఉద్యోగుల హెల్త్ స్కీం రూపొందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లపై ఏమాత్రం కనికరం లేకుండా 1.5 శాతం కోత విధిస్తున్నదని, 30 నెలలు గడిచినా పీఆర్సీ లేదు, హెల్త్ కార్డులు లేవు, 6 డీఏల జాడే లేదు.. సీపీఎస్ రద్దు ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. పెన్షన్ బకాయిల అందక మానసిక వ్యథతో రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు. మలి వయస్సులో పోరాటం చేయాల్సిన దుస్థితి కల్పించావని, హాస్పిటల్స్‌కు నిధులు చెల్లించకుండా పోలీసులకు భద్రత పథకాన్ని అటకెక్కించావని ఆరోపించారు. జర్నలిస్టుల హెల్త్ కార్డులను గాలికి వదిలేసి జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రశ్నార్థకం చేశావన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఎక్కువున్నాయని విద్యా కమిషన్‌తో చెప్పించావు,. మొన్న రిటైర్డ్ ఇంజినీర్లను జైలుకు పంపుతానని బెదిరింపులకు పాల్పడ్డావు.. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ఎందుకు పగతో వ్యవహరిస్తున్నావు రేవంత్ రెడ్డీ అని హరీష్‌రావు నిలదీశారు. ఇప్పటికైనా మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుంటే వారి పక్షాన బీఆర్ఎస్ పోరాటానికి సిద్ధం అవుతుందని హెచ్చరించారు. హెల్త్ కార్డులు వెంటనే జారీ చేసి పథకం అమలు చేయకుండా కోత విధించిన డబ్బులను తిరిగి వారి ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పాతబస్తీ ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ దుమారం

మొదటిపేజీ తరువాయి

ఎంఐఎం ఆరోపిస్తోంది. ఈ అంశాన్ని పార్టీ అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నాలు ప్రారంభించింది.

**ప్రభుత్వానికి ఎంఐఎం విజ్ఞప్తి**

ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ అవకాశం లభించలేదని ఎంఐఎం వర్గాలు పేర్కొంటున్నాయి. అనంతరం పార్టీ ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి తమ అభ్యర్థనలను వినిపించింది. పౌరులకు శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలు లేదా కుటుంబ నమోదు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరింది. కర్ణాటకలో అమలవుతున్న విధానాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో కూడా అలాంటి వ్యవస్థను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేసింది.

**ఓటర్ల జాబితాపై ఆందోళనలు**

పాతబస్తీలోని అనేక కుటుంబాలు దశాబ్దాలుగా ఒకేచోట నివసిస్తున్నప్పటికీ వారి వద్ద అవసరమైన పాత నివాస ఆధారాలు, చట్టబద్ధ పత్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని ఎంఐఎం అభిప్రాయపడుతోంది. మరోవైపు ఓటర్ల జాబితాలో మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు కొనసాగడం, ఒకే చిరునామాలో అధిక సంఖ్యలో ఓటర్లు నమోదు కావడం వంటి అంశాలపై కూడా చర్చ కొనసాగుతోంది.

**రాజకీయ సమీకరణాలపై ప్రభావం**

పాతబస్తీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటే భవిష్యత్ స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సంప్రదాయ ఓటు బ్యాంక్‌పై ప్రభావం పడకుండా చూడాలనే ఉద్దేశంతోనే ఎంఐఎం ఈ అంశాన్ని బలంగా ప్రస్తావిస్తోందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వం ఆచితూచి అడుగులు**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన పరిమితులను దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే రాజకీయ, చట్టపరమైన వివాదాలు తలెత్తే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం ప్రకటించలేదు. ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే పాతబస్తీ రాజకీయ పరిస్థితులపై స్పష్టమైన చిత్రం వెలుగులోకి వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# బాలికపై గ్యాంగ్ రేప్ కేసులో

## ఐదుగురికి జీవిత ఖైదు

మొదటిపేజీ తరువాయి

కోర్టు వెలువరించింది. మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 అక్టోబర్‌లో మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచార (గ్యాంగ్‌రేప్) కేసులో ఐదుగురు నిందితులను దోషులుగా తేల్చిన కోర్టు, వారందరికీ జీవిత ఖైదు విధించింది. అలాగే ఒక్కో నిందితుడికి రూ.20,000 జరిమానా విధిస్తూ, బాధిత బాలికకు రూ.12 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి (ఎఫ్‌ఏసీ), ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి రత్న పద్మావతి ఈ సంచలన తీర్పును వెలువరించారు. ఈ కేసులో మెట్‌పల్లి పోలీసులు నమోదు చేసిన నేరాన్ని అప్పటి డీఎస్పీలు గౌస్ బాబా, రవీంద్రరెడ్డి సమగ్రంగా దర్యాప్తు చేసి బలమైన సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు సమర్థవంతంగా వాదనలు వినిపించగా, కోర్టు అన్ని ఆధారాలను పరిశీలించి నిందితులను దోషులుగా నిర్ధారించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మహిళలు, యువతులు, బాలికలు తమపై జరిగే వేధింపులు, లైంగిక నేరాలు లేదా ఇతర అన్యాయాల విషయంలో ఎలాంటి భయం లేకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, నేరస్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ శిక్ష నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు, దర్యాప్తు అధికారులు, అప్పటి ఎస్ఐ సదాకర్, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ రంజిత్, సీఎంఎస్ కానిస్టేబుళ్లు ఎం. కిరణ్ కుమార్, శ్రీధర్, రాజు తదితరులను జిల్లా ఎస్పీ అభినందించారు.




# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

- **ఉత్తమ సేవల అంగన్‌వాడీ సిబ్బందికి ఆగస్టు 15న సన్మానం**
- **వచ్చే నెల నుంచి అంగన్‌వాడీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం**
- **మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క**



హైదరాబాద్, జూలై 15 :

చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై మంత్రి సీతక్క సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది అన్నారు. 'మీ పిల్లలు, మన వరాళ్ల వయస్సు ఉన్న చిన్నారులే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు.. వారిని సొంత పిల్లలుగా భావించి సేవ చేయాలి.. పిల్లలు అంగన్‌వాడీకి రావడం ఒక మెట్టు.. వారు హుషారుగా, ఆరోగ్యంగా ఎదగడం మరో ఎత్తు. వారి మేధాశక్తిని పెంచేలా మన సేవలు ఉండాలి' అని అధికారులకు సూచించారు. గతంలో ఉమ్మడి జిల్లాలు చాలా పెద్దగా ఉండేవని, ప్రస్తుతం చిన్న జిల్లాలు ఏర్పడినందున మారుమ□ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా జిల్లా అధికారులు సందర్శించాలని మంత్రి ఆదేశించారు. డీడబ్ల్యూవోలు, సూపర్‌వైజర్లు భోజనం నాణ్యతను పరిశీలించేందుకు తరచూ అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలని సూచించారు. గుడ్లు, పప్పు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల ఇండెంట్, సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని మంత్రి సీతక్క హెచ్చరించారు. 'మీకు నాణ్యమైన సరకులు రాకపోతే మాకు రిపోర్టు చేయండి.. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందాలి.. గర్భిణులు, బాలింతల విషయంలోనూ ఎలాంటి రాజీ ఉండదు.. మంచి జరిగినా, లోపం ఉన్నా మీ అనుభవాలను మాకు తెలియజేయండి.. వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరుస్తాం' అని మంత్రి తెలిపారు. ఒకటి రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేశారని పత్రికల్లో వచ్చిన కథనాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఆయా వార్తలపై జిల్లా అధికారులు వెంటనే సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం మంచి ఫలితాలు ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల చిన్నారుల హాజరు పెరగడంతోపాటు వారి అభ్యాస సామర్థ్యం కూడా మెరుగుపడుతోందన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆ పథకం అమలుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**పిల్లల సంఖ్య పెరుగుదలపై నివేదికలు సిద్ధం చేయాలి**

'అమ్మ మాటఅంగన్‌వాడీ బాట' ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య ఎంత మేర పెరిగిందో జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. పాలు అందించడం వంటి నూతన కార్యక్రమాల ఫలితాలను కూడా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన 2,500 నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరాన్నిబట్టి భవిష్యత్తులో మరో 2,500 నుంచి 3,000 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. మంజూరైన భవనాలను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఒకేసారి ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, పైప్‌లైన్ నీటి కనెక్షన్ వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని స్పష్టం చేశారు. వలస కార్మికుల పిల్లల కోసం కార్మిక శాఖ సహకారంతో మొబైల్ అంగన్‌వాడీలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ మొబైల్ అంగన్‌వాడీలను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మారుమూల గుత్తికోయ గూడేల్లోని చిన్నారులకు కూడా పోషకాహారం, ఫీడింగ్ సేవలు పూర్తిస్థాయిలో అందాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క చిన్నారి ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదన్నారు. సిబ్బంది ప్రవర్తన, క్రమశిక్షణ ఆదర్శంగా ఉండాలని, పిల్లలతో ఎలా మాట్లాడాలి, ఎలా మెలగాలి, వారి మానసిక వికాసానికి ఎలా తోడ్పడాలనే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు రోజు వారి జీవితానికి అవసరమైన వివిధ అంశాలను పరిచయం చేస్తూ వారి మేధాశక్తి, గ్రహణ శక్తి పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే 12 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని, ఒకటి రెండు రోజుల్లో మిగిలిన జిల్లాల్లోనూ నోటిఫికేషన్లు విడుదల చేయాలని సూచించారు. రాష్ట్రాన్ని బాల్య వివాహాల రహిత తెలంగాణగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మన పరిధిలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకూడదు.. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవాలి అని స్పష్టం చేశారు. శిశు సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతోపాటు దత్తత ప్రక్రియను వేగవంతం చేసి ప్రత్యేక దత్తత సంస్థల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**బాగా పనిచేసే వారిని ఆగస్టు 15న సన్మానిద్దాం**

అంగన్‌వాడీ వ్యవస్థలో అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, టీచర్లు, ఆయాలను గుర్తించాలని మంత్రి సూచించారు. ఆగస్టు 15 నాటికి ఉత్తమ సేవలందిస్తున్న వారిని ఎంపిక చేసి సన్మానించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు టీచర్లతో త్వరలో సమావేశమై వారి సమస్యలను వింటామని తెలిపారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే సిబ్బంది అనుభవాలు, సూచనలను స్వీకరించి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. వచ్చే నెల 16, 17 తేదీల్లో మళ్లీ సమీక్షిస్తా. ఈ నెల రోజుల కాలాన్ని సవాలుగా తీసుకుని పనిచేయండి అని మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బి.అపర్ణ, మర్రిపల్లి చందన, ప్రేమలతా అగర్వాల్, కంచర్ల వందనగౌడ్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, టీజీ ఫుడ్స్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ మోతి, పంచాయతీరాజ్ ఈఎన్సీ జోగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హుస్సేన్ సాగర్ ప్రాజెక్టులో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఊరట

హైదరాబాద్, జూలై 15

హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మాణాలకు సంబంధించిన వివాదంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సదరు నిర్మాణ ప్రాజెక్టుపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం ఆదేశించింది.

సోమాజిగూడ నెక్లెస్ రోడ్డు సమీపంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిన బహుళ అంతస్తుల భవనం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని పేర్కొంటూ జీహెచ్ఎంసీ ఇటీవల షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ సంస్థ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు, కేసుపై తదుపరి విచారణ పూర్తయ్యే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. ప్రాజెక్టుపై ఎలాంటి కూల్చివేతలు లేదా ఇతర బలవంతపు చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని జీహెచ్ఎంసీ తరపు న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్-450 ప్రకారం మంజూరు చేసిన భవన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని కోరుతూ జూలై 7న జీహెచ్ఎంసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ నోటీసును సవాల్ చేస్తూ ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, తదుపరి విచారణ వరకు సంస్థకు తాత్కాలిక రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# ఉమ్మడి ఖమ్మం రహదారులు అభివృద్ధి చేయండి

ఖమ్మం, జూలై 15 :

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతజౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు రాశారు. ఖమ్మంఅశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు, ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన లింకు మంజూరు, కొత్తగూడెంపాల్వంచ పట్టణాలకు బైపాస్ నిర్మాణం, భద్రాచలం పట్టణానికి బైపాస్ మంజూరుపై ఈ లేఖల్లో ఆయన వివరించారు.

**భద్రాచలం పట్టణానికి బైపాస్**

ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ఉత్తరాది రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి30 ప్రస్తుతం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఉన్న భద్రాచలం పట్టణం నడిబొడ్డు గుండా వెళ్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాలతో పాటు ఏటా భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రద్దీ కలగలిసి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. 10 కిలోమీటర్ల పరిధిలోనే తొమ్మిది ప్రమాద ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్లు) ఏర్పడి, ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన పండుగల సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం భారీ వాహనాలను గంటల తరబడి నిలిపివేయాల్సి రావడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం, సరుకు రవాణాకు ఆలస్యం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల భద్రాచలం కరకట్ట మీదుగా ప్రత్యామ్నాయ హైవే నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చినా, దానికి రూ.120 కోట్ల భారీ వ్యయం అవుతుందని మంత్రి గుర్తుచేశారు. అదే భద్రాచలం పట్టణానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు నిర్మిస్తే కేవలం రూ.25 కోట్లతోనే పూర్తి చేయవచ్చని, ఖర్చు తక్కువగా ఉండటమే కాకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ బైపాస్‌తో దీర్ఘకాలిక ట్రాఫిక్ రవాణాకు, ముఖ్యంగా భారీ వాణిజ్య వాహనాలకు పట్టణం గుండా వెళ్లే అవసరం తప్పుతుందని, భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం లభిస్తుందని, ప్రమాదాలు గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని, సరుకు రవాణా మెరుగుపడి ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ 30 వ్యూహాత్మక ప్రాధాన్యతను, భద్రాచలంలో రహదారి భద్రత అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని బైపాస్ నిర్మాణానికి పరిపాలన, ఆర్థిక అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని మంత్రి కోరారు.

**ఖమ్మం-అశ్వారావుపేట నాలుగు వరుసలు**

జాతీయ రహదారి 365బీబీలోని ఖమ్మంఅశ్వారావుపేట మార్గాన్ని, జాతీయ రహదారి 563లోని వరంగల్‌ఖమ్మం మార్గాన్ని తొలుత నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించినట్లు మంత్రి గుర్తుచేశారు. అయితే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రస్తుత రహదారుల విస్తరణకు బదులు ఖమ్మందేవరపల్లి (365బీజీ), వరంగల్‌ఖమ్మం (163జీ) పేరుతో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారులను చేపట్టిందని తెలిపారు. దీంతో ప్రస్తుత 365బీబీ, 563 రహదారుల విస్తరణ పక్కనపెట్టినట్లు వివరించారు. ఖమ్మం, వెంకటాయపాలెం, తనికెళ్ల, కొణిజర్ల, పల్లిపాడు, వైరా, పినపాక, తల్లాడ, అంజనాపురం, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, గంగారం, మండలపల్లి, అశ్వారావుపేట తదితర జనావాసాల గుండా సాగే ఈ 122 కిలోమీటర్ల రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి కొనసాగుతుందని, సుమారు 40 బ్లాక్‌స్పాట్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

# ఆదిలాబాద్ సీసీఐని వెంటనే తెరిపించాలి

హైదరాబాద్, జూలై 15:

ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ప్లాంట్‌ను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర హెవీ ఇండస్ట్రీస్ శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇతర ముఖ్య నేతల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో సిసిఐ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి స్పష్టం చేశారన్నారు. సిసిఐ ప్లాంట్ పునః ప్రారంభం కావడానికి ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోత్సాహం, చిత్తశుద్ధి ఎంతో అవసరమని కెటిఆర్ పేర్కొన్నారు. కేంద్రం అడిగిన వివరాలపై స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్లాంట్ కోసం ఎలాంటి ప్రతిపాదనలు చేస్తుందో, ఎంత పెట్టుబడి పెడుతుందో వెంటనే బహిరంగంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. మారుమూల ప్రాంతానికి చెందిన వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ సిసిఐ ప్లాంట్‌ను తిరిగి తెరిపించే వరకు బిఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని నేతలు స్పష్టం చేశారు. కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి జోగురామన్న, రాజ్యసభ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో సిసిఐ సాధన సమితి సభ్యుల బృందం ఈరోజు కేంద్ర హెవీ ఇండస్ట్రీస్ శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించింది. దాదాపు అరగంట సేపు సాగిన ఈ సమావేశంలో ప్లాంట్ పునరుద్ధరణకు ఉన్న అవకాశాలు, ఎదురవుతున్న ఆటంకాలపై క్షుణ్ణంగా చర్చించారు. 1980వ దశకంలో ఏర్పాటైన ఆదిలాబాద్ సిసిఐ ప్లాంట్ ఒకప్పుడు 6000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించి ఆ ప్రాంతానికి జీవనాధారంగా నిలిచిందని గుర్తుచేశారు. ఇక్కడ రాబోయే 100 సంవత్సరాలకు సరిపడా లైమ్‌స్టోన్ (సున్నపురాయి) నిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని, 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల ఈ ప్లాంట్‌ను తిరిగి విజయవంతంగా నడపడానికి అన్ని రకాల అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2019 పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి శ్రీ అమిత్ షా, సహాయ మంత్రి శ్రీ హన్స్ రాజ్ గంగారామ్ ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని స్వయంగా హామీ ఇచ్చారని, కానీ నేడు క్షేత్రస్థాయిలో దీన్ని తెరిపించాల్సింది పోయి తుక్కు (స్క్రాప్) కింద మార్చి విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని కెటిఆర్ తెలిపారు. ఇక్కడ రూ.2000 కోట్ల పెట్టుబడితో సరికొత్త ఫ్యాక్టరీని పెట్టినట్టయితే బాగుంటుందని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. ప్లాంట్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రధాన ఆటంకంగా మారిందని నేతలు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా భారత రాష్ట్ర సమితి అనేక సందర్భాల్లో చేసిన ఒత్తిడి ఫలితంగా సిసిఐ ఆదిలాబాద్ పునరుద్ధరణ పైన సానుకూలంగా ఉన్నట్టు కేటీఆర్ తెలిపారు. అయితే సిసిఐ పునరుద్ధరణ కోసం గత ఏడాది కాలంగా కేంద్రం ఇన్సెంటివ్స్, పవర్ సబ్సిడీ, క్యాపిటల్ సబ్సిడీ, జిఎస్‌టి మినహాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కోరుతున్నా స్టేట్ గవర్నమెంట్ స్పందించకుండా విషయాలను దాటవేస్తోందని, మైనింగ్ లీజ్ పొడిగించడానికి ముందుకు రావడం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు కేటీఆర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉండి అదిలాబాద్ జిల్లా ప్రజలంతా దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్న సిసిఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య పూరిత వైఖరిపై కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే సిసిఐ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం తరఫున పెట్టుబడి ప్రణాళికలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.



# నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారం

## ఎల్‌నినో సవాళ్లకు జాతీయ జల విధానమే సమాధానం

### పార్లమెంట్‌లో రాజకీయాలకే కాదు.. నీటి భద్రతకూ ప్రాధాన్యం ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు,సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు,తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. కేవలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసంధానం ఇందులో ప్రధానమైన సమస్య. మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుండదు. నదులను అనుసంధానించడం, జలరక్షణను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్ధతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందానం చేయాలి. అలాగే నీటి సంరక్షణను కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధానమైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్నిరోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్దం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు కేటాయించాలి. అప్పుడే దేశం ఎల్‌నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేకపోతే వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వం-ుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వం-ర్తమాన వాస్తవం. ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులంద రికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండల స్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి.

# ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం

- రూ.2.19 లక్షల కోట్లకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, వారణాసి అభివృద్ధికి భారీ ఊతం
- ఎరువుల స్వయం సమృద్ధి.. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు నిర్ణయాలు



**న్యూఢిల్లీ, జూలై 15(రాజముద్ర న్యూస్):** దేశ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మొత్తం రూ.2,19,353 కోట్ల విలువైన ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. సెమీకండక్టర్ల తయారీలో భారత్‌ను ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడం, మొబైల్ తయారీని విస్తరించడం, ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి సాధించడం, వారణాసిలో భారీ మౌలిక సదుపాయాల కల్పన, రైల్వే నెట్‌వర్క్ బలోపేతం వంటి నిర్ణయాలకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. భారత్‌ను అంతర్జాతీయ చిప్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సెమీకండక్టర్ మిషన్--2.0కు రూ.1,27,500 కోట్ల భారీ కేటాయింపును క్యాబినెట్ ఆమోదించింది. దీని ద్వారా దేశంలో అత్యాధునిక సెమీకండక్టర్ తయారీ, రూపకల్పన, ప్యాకేజింగ్ పరిశ్రమలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభించనుంది. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేందుకు మొబైల్ ఫోన్ తయారీ ప్రోత్సాహక పథకంకు రూ.62,500 కోట్లను కేటాయించారు. ఈ పథకం అమలుతో దేశీయ మొబైల్ ఉత్పత్తి పెరగడంతో పాటు వేలాది ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యంగా యూరియా జాతీయ పెట్టుబడి విధానం--2026కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశీయ యూరియా ఉత్పత్తిని పెంచి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. దీనికి ప్రత్యేక నిధుల కేటాయింపు లేకపోయినా విధానపరమైన అనుమతి లభించింది. వారణాసి నగర అభివృద్ధికి రూ.25,446 కోట్ల విలువైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వరుణా నది వెంబడి రూ.10,998 కోట్లతో ఆరు, నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్, గంగా నది వెంబడి రూ.14,448 కోట్లతో ఆరు లేన్ల అత్యాధునిక ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా రెండు కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. పారాదీప్--హరిదాస్‌పూర్ రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు రూ.2,542 కోట్లు, డాంగోవాపోసి-రాజ్‌ఖర్సవాన్ మార్గంలో నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.1,365 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు పారిశ్రామిక వృద్ధితో పాటు మౌలిక సదుపాయాల విస్తరణ, రైతులకు ఎరువుల భద్రత, దేశీయ తయారీ సామర్థ్య పెంపు, ఉపాధి అవకాశాల సృష్టికి దోహదపడతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సెమీకండక్టర్, మొబైల్ తయారీ రంగాల్లో ఈ నిర్ణయాలు ప్రపంచ మార్కెట్లో భారతదేశ పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై పిల్




- కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు!
- వేగంగా క్షీణిస్తున్న సామాజిక కార్యకర్త ఆరోగ్యం
- ఇప్పటికే 8.5 కిలోల బరువు తగ్గినట్లు కోర్టుకు తెలిపిన పిటిషనర్
- తక్షణ వైద్య సహాయంపై నివేదిక ఇవ్వాలని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు ఆదేశం

**న్యూఢిల్లీ, జూలై 15(రాజముద్ర న్యూస్):** ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం నిరవధిక నిరాహార దీక్ష కారణంగా వేగంగా క్షీణిస్తుండటంపై ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన ప్రాణాలను కాపాడేందుకు తక్షణ వైద్య సహాయం అందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని న్యాయస్థానం అత్యవసరంగా విచారించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ ప్రభుత్వానికి హైకోర్టు కీలక నోటీసులు జారీ చేసింది. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష కారణంగా ఆయన శరీరం తీవ్రంగా సహకరించడం లేదని, ఇప్పటికే దాదాపు 8.5 కిలోల బరువు తగ్గారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆయన ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, వైద్యుల పర్యవేక్షణలో అవసరమైతే బలవంతంగానైనా ద్రవాహారం (లిక్విడ్ డైట్) అందించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న పలు అవకతవకలకు వ్యతిరేకంగా సాగుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమానికి మద్దతుగా సోనమ్ వాంగ్‌చుక్ ఈ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. విద్యా రంగంలో సంస్కరణలు కోరుతూ ఆయన చేస్తున్న ఈ దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న నేపథ్యంలో, హైకోర్టు జోక్యం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది.

# అయోధ్య విరాళాల వివాదం

- 'నేను పారిపోయే వాడిని కాదు'
- ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి స్పష్టీకరణ
- రూ. మూడు కోట్ల నగదు గోల్‌మాల్‌పై ఎస్‌బీఐపైనే విమర్శలు
- బంగారం మాయమైందన్న ప్రచారాన్ని ఖండించిన ట్రస్ట్



**అయోధ్య, జూలై 15(రాజముద్ర న్యూస్):** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల దుర్వినియోగం వ్యవహారంపై ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి మహారాజ్ స్పందించారు. ఈ వివాదం నేపథ్యంలో తాను రాజీనామా చేస్తున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. తాను ఎక్కడికీ పారిపోయే వ్యక్తిని కాదని, ఛత్రపతి శివాజీ మహారాజ్ అనుచరుడిగా సమస్యను ధైర్యంగా ఎదుర్కొంటానని, బాధ్యతల నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విరాళాల గోల్‌మాల్‌కు సంబంధించి అరెస్టయిన వారంతా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమించిన సిబ్బందేనని, వారి నియామకాలు, నేపథ్య పరిశీలన బాధ్యత బ్యాంకుదేనని ఆయన ఆరోపించారు. సుమారు రూ. మూడు కోట్ల మేర నగదు గోల్‌మాల్ జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నామని, అయితే అది బ్యాంకు ఖాతాల్లోని నిధులు కాదని, విరాళాల పెట్టెల్లో వచ్చిన నగదేనని వివరించారు. ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా పూర్తిగా స్వచ్ఛందమని, ఆయన వ్యవహారశైలిలో నిర్లక్ష్యం ఉన్నప్పటికీ బలిపశువుగా మార్చలేదని గోవింద్ దేవ్ గిరి పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బందికి జేబులు లేని యూనిఫాంలు అందించడం, సీసీటీవీ నిఘాను మరింత బలోపేతం చేయడం, విరాళాల నగదు లెక్కింపును ట్రస్ట్, బ్యాంకు అధికారుల సంయుక్త పర్యవేక్షణలో నిర్వహించడం వంటి కఠిన చర్యలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే రూ.1,400 కోట్ల విలువైన బంగారం మాయమైందన్న ప్రచారాన్ని పూర్తిగా ఖండించిన ఆయన, ఆ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది.

# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో గ్యాస్ సిలిండర్‌లు

- 10 నిమిషాల్లోనే ఇంటికి..
- దేశంలోనే తొలిసారిగా సరికొత్త సేవలు!

**బెంగళూరు, జూలై 15(రాజముద్ర న్యూస్):** ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు రీఫిల్ బుక్ చేసుకుంటే డెలివరీ కావడానికి రెండు మూడు రోజులు పడుతోంది. అయితే, ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా కేవలం పది నిమిషాల్లోనే గ్యాస్ సిలిండర్‌ను ఇంటికి చేరవేసే సరికొత్త విధానం త్వరలోనే బెంగళూరు వాసులకు అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ప్రముఖ క్విక్ కామర్స్ వేదిక 'స్విగ్గీ ఇన్‌స్టామార్ట్'తో ప్రభుత్వ రంగ చమురు సంస్థ 'హెచ్‌పీసీఎల్' కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా, హెచ్‌పీసీఎల్‌కు చెందిన 10 కేజీల 'నవ్య' సిలిండర్లను బుక్ చేసుకున్న 10 నిమిషాల్లోనే కస్టమర్ల ఇళ్లకు డెలివరీ చేయనున్నారు. గ్యాస్ కనెక్షన్ లేని వారు, చిన్న కుటుంబాలు, బ్యాచిలర్స్, విద్యార్థులకు అనువుగా ఉండేలా ఈ నవ్య గ్యాస్ సిలిండర్‌లను రూపొందించారు. సాధారణ స్టీల్ సిలిండర్‌ల కంటే భిన్నంగా, వీటిని అత్యాధునిక కాంపోజిట్ పాలిమర్‌తో తయారు చేశారు. పాక్షిక పారదర్శకంగా ఉండే ఈ సిలిండర్లలో గ్యాస్ ఎంత మిగిలి ఉందో బయటి నుంచే చూసి తెలుసుకోవచ్చు. పైగా, ఇవి సాధారణ స్టీల్ సిలిండర్ల కంటే 50 శాతం తక్కువ బరువు ఉంటాయి. త్వరితగతిన బుక్ చేసుకునే సదుపాయం ఉన్నప్పటికీ, భద్రతా ప్రమాణాల దృష్ట్యా ఈ సిలిండర్‌లను సాధారణ గ్యాస్ ఏజెన్సీలకు చెందిన నిపుణులైన సిబ్బంది ద్వారానే డెలివరీ చేయనున్నట్లు హెచ్‌పీసీఎల్ స్పష్టం చేసింది. మొదటి సారి బుక్ చేసుకునే కస్టమర్ల నుంచి అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న తర్వాతే సిలిండర్ కేటాయిస్తారు. ఆ తర్వాతి బుకింగ్‌లను రీఫిల్‌గా పరిగణిస్తారు. రీఫిల్ డెలివరీ తీసుకునే సమయంలో కస్టమర్లు తమ వద్ద ఉన్న ఖాళీ నవ్య సిలిండర్‌ను సిబ్బందికి తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. ఎల్‌పీజీ సిలిండర్‌లను మరింత సులభంగా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకే ఈ వినూత్న సేవలను ప్రారంభిస్తున్నట్లు హెచ్‌పీసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ అమిత్ గర్గ్ తెలిపారు. కాగా, ఈ సేవలను ఇతర నగరాలకు ఎప్పుడు విస్తరిస్తారనే వివరాలను సంస్థ ఇంకా వెల్లడించలేదు.






# కూకట్‌పల్లి విశ్వంభరలో విశ్వనాథుడి మాయ..?

- పై అధికారుల పేరు మీద... అందిన కాడికి దండుకుంటున్న "నాక్ ఇంజనీర్"..!
- ఒక్కో అక్రమ నిర్మాణానికి.. 2 నుంచి 3 లక్షల దాకా వసూలు..?







**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని విశ్వంభర ఎన్క్లేవ్ , గోపాల్ నగర్, కెపిహెచ్బి, బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఒక ఉన్నతాధికారి లీలలు ఇప్పుడు స్థానికంగా పెను సంచలనంగా మారాయి. సదరు "విశ్వనాథుడు" తన అధికారిక అస్త్రాన్ని అడ్డుపెట్టుకొని చేస్తున్న మాయాజాలంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతాధికారుల పేరుతో వసూళ్ల పర్వం!**

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇక్కడ పనిచేస్తున్న ఒక నాక్ (NAC) ఇంజనీర్ అక్రమ నిర్మాణాలనే తన పెట్టుబడిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి కడుతున్న బిల్డింగులను గుర్తించడం, ఆపై సదరు యజమానులను భయభ్రాంతులకు గురిచేయడం ఈయనకు పరిపాటిగా మారింది. అయితే, ఈ వసూళ్ల వెనుక తను మాత్రమే లేనట్లు, పై అధికారులకు కూడా వాటాలు ఇవ్వాలంటూ పెద్దల పేర్లను వాడుకుంటూ అందిన కాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఒక్కో బిల్డింగ్‌కు రూ. 50 వేల నుంచి 3 లక్షలు!**

ఈ "నాక్ ఇంజనీర్" గారి రేట్ల పట్టిక చూసి సామాన్య జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఒక్కో అక్రమ నిర్మాణానికి, నిబంధనల ఉల్లంఘన స్థాయిని బట్టి రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

"డబ్బులు ఇస్తే ఎలాంటి నిబంధనలు లేకపోయినా నిర్మాణాలు యథేచ్ఛగా సాగిపోవచ్చు, లేదంటే డెమాలిషన్ నోటీసులు వస్తాయి" అంటూ సదరు ఇంజనీర్ చక్రం తిప్పుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించేనా..?**

పై అధికారుల పేర్లు వాడుకుంటూ, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, సొంత జేబులు నింపుకుంటున్న ఈ అవినీతి తిమింగలంపై విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కూకట్‌పల్లి విశ్వంభర పరిధిలో జరుగుతున్న ఈ "విశ్వనాథుడి" మాయాజాలానికి, నాక్ ఇంజనీర్ ముసుగులో చేస్తున్న వసూళ్ల పర్వానికి బ్రేక్ వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్‌టీఐ ముసుగులో అక్రమ వసూళ్లు సహించం

- విద్యాసంస్థలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు: డీసీపీ
- పాఠశాలలకు పోలీసు శాఖ పూర్తి అండ – ఫిర్యాదు అందితే వెంటనే కేసులు నమోదు: ఏసీపీ
- చట్టాన్ని దుర్వినియోగం చేసే వారిపై శాఖాపరమైన చర్యలు అనివార్యం: ఎంఈఓ రామారావు



**రామంతపూర్, జూలై 15 (రాజముద్ర న్యూస్):** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించేందుకు ఉద్దేశించిన చట్టం. అయితే, అదే చట్టాన్ని కొందరు వ్యక్తులు దుర్వినియోగం చేస్తూ విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు, అక్రమ డబ్బుల డిమాండ్లు, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారంటూ ఉప్పల్–రామంతపూర్ ప్రాంతాలకు చెందిన పలు పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ), అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ), రీజినల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, ఉప్పల్ మండల విద్యాధికారి (ఎంఈఓ) రామారావు సమక్షంలో పాఠశాలల ప్రతినిధులు సమావేశమై తమ సమస్యలను వినిపించారు. సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ, ఆర్‌టీఐ పేరును అడ్డుపెట్టుకుని చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ విద్యాసంస్థలను బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం, అసత్య ఫిర్యాదులతో ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలను పోలీసులు ఏమాత్రం సహించబోరని స్పష్టం చేశారు. చట్టబద్ధంగా పనిచేస్తున్న విద్యాసంస్థలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు."మీ పాఠశాలలకు ఎవరైనా వచ్చి డబ్బులు డిమాండ్ చేసినా, బెదిరించినా లేదా తప్పుడు ఫిర్యాదుల పేరుతో ఒత్తిడి తీసుకొచ్చినా వెంటనే పోలీసులను ఆశ్రయించండి. ఫిర్యాదు అందిన వెంటనే చట్టప్రకారం కేసులు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. చట్టం మీకు రక్షణగా నిలుస్తుంది" అని డీసీపీ స్పష్టం చేశారు. ఏసీపీ మాట్లాడుతూ, విద్యాసంస్థల ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే వారిని ఉపేక్షించబోమని, అక్రమ వసూళ్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విద్యాసంస్థ నిర్భయంగా పనిచేసేలా పోలీసు శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు మాట్లాడుతూ, విద్యాశాఖ పేరును దుర్వినియోగం చేస్తూ లేదా ఆర్‌టీఐని అడ్డుపెట్టుకుని పాఠశాలలను వేధించే, బెదిరించే వ్యక్తులపై శాఖాపరంగానూ, చట్టపరంగానూ తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటువంటి సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ఎవరూ అక్రమ ఒత్తిళ్లకు లొంగవద్దని పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. సమావేశంలో పాల్గొన్న పాఠశాలల ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు ఆర్‌టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ వేధింపులకు పాల్పడటం వల్ల విద్యావ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు శాఖ, విద్యాశాఖ సమన్వయంతో ఇలాంటి అక్రమ చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్, రామంతపూర్ ప్రాంతాలకు చెందిన వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, నిర్వాహకులు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎక్మో విధానంతో ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం!

**యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ**



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో,ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో 'ఎక్మో' (కృత్రిమ గుండె–ఊపిరితిత్తుల పరికరం) విధానం ఒక సంజీవనిలా మారుతోందని హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేఖరుల సమావేశంలో ఆమె ఈ అత్యంత సంక్లిష్టమైన వైద్య విధానం యొక్క విశిష్టతను మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుబాటులోకి వచ్చాయో వివరించడానికి, చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల్లో భరోసా నింపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.ప్రాణం నిలిపే 'ఎక్మో' (కృత్రిమ శ్వాస వ్యవస్థ) విధానం: చివరి దశ 'ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్' లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ 'వెనో–వీనస్ ఎక్మో' లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామని. ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది. ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి, దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది. ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు, దాత దొరికేవరకు ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి వివరించారు. సెకన్ల సమన్వయంతో సాగే అవయవ మార్పిడి: ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి చేయడం వైద్యశాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. రక్తం గడ్డకట్టడం, అధిక రక్తస్రావం వంటి తీవ్రమైన సాంకేతిక ప్రమాదాలను అధిగమిస్తూ.. గుండె–ఊపిరితిత్తుల నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఐసీయూ నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందని. ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఎక్మో వంటి అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన వైద్య విధానం ద్వారా ప్రాణాలు నిలపడం సాధ్యమేనని స్పష్టం చేశారు. విజయవంతమైన రికవరీ విధానం: శస్త్రచికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం వెంటిలేటర్ల నుండి సురక్షితంగా తొలగించి, కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామని. ఆ తర్వాత క్రియాశీల శారీరక వ్యాయామాల ప్రక్రియ (రిహాబిలిటేషన్) ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్సా విధానం తోడ్పడుతుందని డాక్టర్ తపస్వి వివరించారు ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ విభాగం సీనియర్ మేనేజర్ పరమేష్, మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాయి గూడెం లో ప్రీ ప్రైమరీ సెక్షన్ ప్రారంభం

- సర్పంచ్ బోయిన వేణు చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- "ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి" - సర్పంచ్ పిలుపు



**ఖమ్మం రాజముద్ర న్యూస్, నేలకొండపల్లి:** నేలకొండపల్లి మండలం రాయి గూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా ప్రీ ప్రైమరీ సెక్షన్ ను రాయి గూడెం సర్పంచ్ బోయిన వేణు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బోయిన వేణు మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి మేము కృషి చేస్తాము. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారు. అన్ని రకాల సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. కాబట్టి ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలనే ఆదరించాలని" తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పి. రాంప్రసాద్, ఎంపీడీవో ఎర్రయ్య, ఎంఈఓ చలపతిరావు, కాంప్లెక్స్ హెచ్.ఎం నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగేశ్వరావు, గ్రామ పెద్దలు మరియు పిల్లల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేసే ఈ ప్రీ ప్రైమరీ సెక్షన్ ప్రారంభంతో రాయి గూడెం గ్రామ విద్యార్థులకు మరింత సౌకర్యం కలగనుంది

# డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి




**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, అద్దె వాహనాల నెలవారీ అద్దె ను.55 వేలకు పెంచాలని తెలంగాణ అద్దె వాహనాల యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ పవన్ డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్లతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2017లో అప్పటి ఇంధన ధరలు, వాహనాల నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నెలవారీ అద్దె ను.33 వేలకు నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుతం ఇంధన ధరలు, విడిభాగాల ధరలు, నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అద్దెను రూ.55 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 15 నుంచి 18 నెలలుగా అద్దె వాహనాల బిల్లులు పెండింగ్ లో ఉండటంతో వాహన యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బిల్లులు అందక బ్యాంకు ఈఎంఐలు చెల్లించలేకపోతున్నామని, వాహనాలకు ఇంధనం కూడా పోయించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కలెక్టరేట్ లో డ్రైవర్ల కోసం ప్రత్యేక విశ్రాంతి గది (రెస్ట్‌రూమ్), వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఎండ, వానల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని, డ్రైవర్లు కూడా కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైవర్లకు ప్రత్యేక గది కేటాయించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వెంకన్న, ఉపాధ్యక్షులు తన్నీరు మహేష్, యూనియన్ సభ్యులు రహీం, సాయికుమార్, హరీష్, హుస్సేన్ నాయక్, సందీప్, జీవన్, కృష్ణ, సుమన్ నాయక్, సంతోష్, షరీఫ్,శ్రీకాంత్, సిద్ధార్థ్, మధు, హరీష్, నగేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లి బౌద్ధ స్తూపం వద్ద చేతి పంపు ప్రారంభం

- పర్యాటకుల కోసం దాతల సహకారంతో ఏర్పాటు
- సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి ప్రారంభించారు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లిలోని చారిత్రక బౌద్ధ స్తూపం ను సందర్శించే పర్యాటకులు, భక్తుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతి పంపు(బోరు)ను ఘనంగా ప్రారంభించారు.నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై పంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త శీలం నరసింహారావు కూడా పాల్గొన్నారు.ఈ చేతి పంపును బి.ఎల్.ఐ.ఎ. హైదరాబాద్ చాప్టర్ దాతలు ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ బాధ్యతను ధమ్మపద బుద్ధవిహార్ చారిటబుల్ ట్రస్ట్, నల్గొండ మరియు గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ సంయుక్తంగా తీసుకుంటాయిన్నారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎం ఆర్ ఓ, ఎంపిడిఓ, 7వ వార్డు సభ్యులు లింగం ఎలమంద , స్థానిక అధికారులు, గ్రామ పెద్దలు, బౌద్ధ భిక్షువులు తదితరులు పాల్గొన్నారు.స్తూపానికి వచ్చే వేలాది మంది సందర్శకులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి అన్నారు. చారిత్రక ప్రదేశాల పరిరక్షణతో పాటు సందర్శకులకు కనీస సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యత అని తెలిపారు.

## గోదాముల వద్ద లక్క పురుగుల కోసం ధర్నా



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** మోషంపూర్ ,ఉప్పల్ వాయి, గ్రామ శివారులోని గోదాముల వద్ద మూడు గ్రామస్థుల ప్రజలు ధర్నా నిర్వహించారు. రామారెడ్డి మండలం మోషంపూర్, ఉప్పల్ వాయి, పోసానిపేట గ్రామాల్లోని ప్రతి ఇండల్లోకి ఇళ్లలోకి గోదాముల్లో నిల్వ ఉంచిన ధాన్యానికి పట్టిన లక్క పురుగులు మూడు గ్రామాల ఇండ్లల్లోకి వచ్చి తినే తిండిలో, త్రాగే నీటిలో లక్క పురుగులు పడుతున్నాయని , వాటి వలన చిన్నపిల్లలు అనారోగ్యానికి గురి కావడం జరుగుతుందని, పిల్లల చెవులల్లకు లక్క పురుగులు వెళ్తున్నాయని అనారోగ్యం పాలవుతున్నారని, లక్క పురుగులు సమస్యను గోదాం యజమాన్యం అధికారులు పట్టించుకోని వెంటనే లక్క పురుగుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే గోదాముల ముందు మూడు గ్రామాల ప్రజలు ఇంటికొకరు చొప్పున వచ్చి గోదాం లోపల వంట వార్పు చేసే ప్రసక్తి వస్తుందని డిమాండ్ చేశారు, ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని అన్నారు. అధికారులకు లక్క పురుగుల సమస్య తీర్చాలని వినతి పత్రం ఇచ్చిన కూడా ఇప్పటివరకు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పిఎంజెడివై పై దుష్ప్రచారాలు వద్దు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- బీజేపీ నేత పాగర్తి సుధాకర్ పిలుపు
- పేదల కోసం కేంద్రం తెచ్చిన అద్భుత పథకం పిఎంజెడివై
- రూ.2 లక్షల ప్రమాద బీమాతో పాటు పలు ప్రయోజనాలు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి ప్రధాన్ మంత్రి జన్–ధన్ యోజన పిఎంజెడివైపథకంపై సోషల్ మీడియా, కొన్ని మాధ్యమాలలో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ స్పష్టం చేశారు. ఆయన సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ, "దేశంలోని ప్రతి పేద కుటుంబానికి బ్యాంకింగ్ సేవలు అందించాలనే గొప్ప లక్ష్యంతో మోదీ ప్రభుత్వం పిఎంజెడివై పథకాన్ని ప్రారంభించింది. ఇది పేదల జీవితాల్లో వెలుగు నింపిన పథకం" అని అన్నారు.

**పిఎంజెడివై తో కలిగే లాభాలేంటి?**

జీరో బ్యాలెన్స్ తో ఖాతా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్యాంకు లేని ప్రతి కుటుంబానికి సులభంగా బ్యాంక్ ఖాతా.రూపే డెబిట్ కార్డు ప్రతి ఖాతాదారుడికి ఉచితంగా రూపే ఎటిఎం కార్డు అందిస్తారు.రూ.2 లక్షల ప్రమాద బీమా, రూపే కార్డు ఉంటే ప్రమాదంలో మరణించినా, వికలాంగులైనా రూ.2 లక్షల వరకు బీమా సౌకర్యం. ప్రభుత్వ పథకాల డబ్బు నేరుగా జమ సబ్సిడీలు, పథకాల డబ్బు మధ్యవర్తులు లేకుండా నేరుగా ఖాతాలో పడుతుంది.ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం అవసరమైన వారికి రూ.10,000 వరకు ఓవర్ డ్రాఫ్ట్ కూడా లభిస్తుంది."కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ప్రారంభించిన ఈ గొప్ప పథకంపై కొందరు రాజకీయ లబ్ధి కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వాటిని నమ్మి మోసపోవద్దు. అర్హులైన ప్రతి ఒక్కరూ బ్యాంకులకు వెళ్లి పిఎంజెడివై ఖాతా తెరిచి ప్రయోజనం పొందాలి" అని పాగర్తి సుధాకర్ కోరారు.ప్రజలకు బ్యాంకింగ్ అవగాహన కల్పించేందుకు బీజేపీ కార్యకర్తలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## తక్కువ వర్షపాతం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ సూచనలు

**వికారాబాద్ మండలం వ్యవసాయ అధికారి జి ప్రసన్నలక్ష్మి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ మండల పరిధిలో ఈ సంవత్సరం వానాకాలంలో తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, ఇప్పటికే రైతులు అధిక శాతం విస్తీర్ణంలో పంటలను సాగు చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను రైతులు తగిన యాజమాన్య పద్ధతులతో సంరక్షించాలని మండల వ్యవసాయ అధికారి జి. ప్రసన్న లక్ష్మి సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల్లో వాడిపోవడం (విథేరింగ్ ) లక్షణాలు కనిపిస్తే, వాటిని తగ్గించేందుకు 2% యూరియా ద్రావణాన్ని (20 గ్రాముల యూరియా/లీటరు నీరు) ఆకులపై పిచికారీ (ఫోలియార్ స్ప్రే ) చేయాలని సూచించారు. ఈ పిచికారీ వల్ల మొక్కలకు తక్షణ నత్రజని అందడంతో పంటలు కోలుకునేందుకు దోహదపడుతుంది. ఒకవేళ ఇప్పటికే సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్న లేదా విఫలమైన ప్రాంతాల్లో రైతులు ఆలస్యం చేయకుండా ప్రత్యామ్నాయ (కాంటింజెన్సీ) పంటలైన పప్పుధాన్యాలు (కందులు, పెసర్లు, మినుములు), నూనెగింజల పంటలు (నువ్వులు,పొద్దుతిరుగుడు,ఆముదం) సాగు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి. ప్రసన్న లక్షి , మండలంలోని అన్ని వ్యవసాయ విస్తరణ అధికారులకు (ఏఈఓ లు) తమ పరిధిలోని గ్రామాల్లోని పంట పొలాలను క్షేత్రస్థాయిలో నిరంతరం సందర్శించి, వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేయడంతో పాటు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, కాంటింజెన్సీ చర్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే మండల కార్యాలయానికి నివేదించాలని కూడా సూచించారు. రైతులు తమ పొలాల పరిస్థితులను పరిశీలిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని, మరిన్ని వివరాల కోసం తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

## ఎల్ నినో ప్రభావంపై ఆయిల్ పామ్ రైతులకు అవగాహన కల్పించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారము వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులతో సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు పంట నిర్వహణ, ఆధునిక సాగు పద్ధతులు, వాతావరణ మార్పుల ప్రభావంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పాడిత చర్యలు చేపట్టాలని, 2శాతం యూరియా పిచికారి చేయాలనీ, గ్రామీణ ప్రాంతాలలో పత్తి, కంది విత్తనాలను అందుబాటులో ఉంచాలని, పంటల పరిస్తితిని పర్యవేక్షించ డానికి క్రమం తప్పకుండ క్షేత్ర పర్యటనలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ తోటల్లో నీటి యాజమాన్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రిప్ ఇరిగేషన్‌ను సమర్థవంతంగా వినియోగించేలా రైతులకు సూచనలు అందించాలని, మల్చింగ్ ద్వారా నేలలో తేమను సంరక్షించాలని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువుల వినియోగం, తెగుళ్లు–పురుగుల నివారణ చర్యలపై రైతులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు ఎప్పటికప్పుడు అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు, క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించాలని, పంటలో ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి కవిత, ఉద్యానవన శాఖ అధికారి మహమ్మద్ సత్తార్,ఇరుగేషన్ అధికారి అశోక్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరుణ దేవుడు కరుణించాలని పిండిప్రోలులో జలాభిషేకం

- బొడ్రాయి ముత్యాలమ్మకు జల బిందెలతో మహిళల భారీ ర్యాలీ
- వర్షా లు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:**తిరుమలాయ పాలెం: వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని మండలంలోని పిండిప్రోలు గ్రామంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో, సర్పంచ్ కామల్ల సువార్త, ఉపసర్పంచ్ చామకూరి రాజు, ల పాలకమండలి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామదేవతలకు జలాభిషేకం కార్యక్రమం ఘనంగా జరిగింది.గ్రామంలోని మహిళలు, యువతులు తలపై జల బిందెలను మోసుకుంటూ గ్రామ వీధుల గుండా భారీ ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీ బొడ్రాయి ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకుంది. ఆలయ ప్రాంగణంలో మహిళలు కోలాటం, ఆటపాటలు, నృత్యాలతో వరుణదేవుని ప్రార్థించారు.అనంతరం గ్రామదేవతలకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండాలని, రైతుల పొలాలు పచ్చని పంటలతో కళకళలాడాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని★ మొక్కులు చెల్లించారు.

**రైతులు సుభిక్షంగా ఉండాలి**

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ మంచి వర్షాలు కురిసి వ్యవసాయం అభివృద్ధి చెందాలని, ప్రతి రైతు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవి, వార్డు సభ్యులు కాంపాటి ప్రమీల, పులుగుజ్జు ఉపేంద్ర, పసలాది ముత్తయ్య, చామకూరి రేణుక, గోకినపల్లి సరోజిని, రైతులు చల్ల వెంకటేశ్వర్లు, పద్మనాభుల సుధాకర్, తాతా రవీందర్, చామకూరి కిరణ్, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి, మాజీ ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు, చామకూరి వెంకన్న, చామకూరి వీరయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమకారుల త్యాగాలను గుర్తించండి

- నేలకొండపల్లి బౌద్ధ స్తూపం వద్ద టియుటివి బహిరంగ సభ
- ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఏర్పాటు.. లింగస్వామి అధ్యక్షుడు
- గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు డిమాండ్



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: తెలంగాణ సాధనలో ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక డిమాండ్ చేసింది.ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ఆదివారం నేలకొండపల్లి బౌద్ధ స్తూపం వద్ద టియుటివి ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు టియుటివి గౌరవ అధ్యక్షులు నరాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సభలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్త కమిటీని ప్రకటించారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ: అధ్యక్షులు:తెల్లగొర్ల లింగస్వామి, ఉపాధ్యక్షులు మారగాని అంజయ్య, ప్రధాన కార్యదర్శి సిద్దల వెంకటరత్నం, కోశాధికారి కాపర్తి నరసింహాచారి, మహిళా అధ్యక్షురాలు తమ్మిశెట్టి మమత, మైనార్టీ అధ్యక్షులు షేక్ కాసిం సాహెబ్ గౌరవ అధ్యక్షులు కట్టెకోళ్ల చిన్నికృష్ణ, చిలకబత్తిని వీరబాబు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్టెకుల వెంకటేశ్వర్లు, ప్రకటించారు నేలకొండపల్లి మండల కమిటీ: అధ్యక్షులు పగిడికత్తుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుణగంటి రామ్మూర్తి, కోశాధికారి తేజావత్ బిక్షం, ఉపాధ్యక్షులు చిలకల భూషయ్య, గౌరవ అధ్యక్షులు బొడ్డు బాబురావు సభను ఉద్దేశించి టియుటివి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వంపై కీలక డిమాండ్లు చేశారు.ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి,250 చదరపు గజాల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించాలి పింఛన్లు మంజూరు చేయాలి ఉద్యమకారుల పిల్లలకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలి నిజమైన ఉద్యమకారులను గుర్తించి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారుఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గండికోట సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముక్కా సత్యనారాయణ, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ సుభాన్ తో పాటు జిల్లా నలుమూలల నుండి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరిచి ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని సభ తీర్మానించింది.

## జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం

- మూఢనమ్మకాలపై నిఘా పెంచాలి
- అక్రమంగా పొలం చుట్టూ కరెంటు ఏర్పాటుపై చట్టపరమైన చర్యలు
- వికారాబాద్ జిల్లా ఎస్పీస్నేహ మెహ్రా




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూ.ఐ, లాంగ్ పెండింగ్, అరెస్ట్ పెండింగ్, పోక్సో, ఎఫ్ఎస్ఎల్ పెండింగ్ నివేదికలు, గ్రేవ్ యూ.ఐ. కేసులు, ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు, రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, సీసీటీఎన్ఎస్, ఈ–సాక్ష్య, సీసీటీవీ ఏర్పాటు, స్టేషన్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లోని పెండింగ్ కేసుల పురోగతిని పరిశీలించిన పరిశీలించారు, దర్యాప్తు అధికారులు ఆలస్యం లేకుండా నాణ్యమైన విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఫుటేజ్, డిజిటల్ సాక్ష్యాలు, సాంకేతిక విశ్లేషణ వంటి ఆధునిక దర్యాప్తు పద్ధతులను వినియోగించి బలమైన సాక్ష్యాధారాలతో కేసులను కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, పోక్సో, అత్యాచార, హత్య కేసులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అరెస్ట్ పెండింగ్ కేసుల్లో నిందితులను త్వరగా అరెస్ట్ చేసి, లాంగ్ పెండింగ్ కేసులను ప్రత్యేక కార్యాచరణతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. మూఢనమ్మకాల పేరుతో జరిగే బాణామతి, చేతబడి వంటి చట్టవిరుద్ధ చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే బ్యాంకులు, ఏటీఎంలు, బంగారం దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లో నిఘా పెంచి ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టాలని సూచించారు. పొలాల చుట్టూ అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి కరెంట్ ప్రవహింపజేయడం వల్ల మానవ ప్రాణాలు, వన్యప్రాణులకు ప్రమాదం ఏర్పడుతున్న నేపథ్యంలో అలాంటి ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ ఇసుక రవాణా, గేమింగ్ జూదం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్‌లోడ్ వాహనాలపై నిరంతర ఎన్ఫోర్స్‌మెంట్ కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సీసీటీ ఎన్ఎస్ , ఈ –సాక్ష్యం అప్‌డేట్లు, కేసు డాక్యుమెంటేషన్‌ను సకాలంలో పూర్తి చేసి, స్టేషన్‌లను ప్రజలకు అనుకూలంగా నిర్వహించాలని సూచించారు. వికారాబాద్ రక్షణ నేత్రం ద్వారా జిల్లాలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటును మరింత విస్తరించాలని, వికారాబాద్ సురక్ష మిత్ర" కార్యక్రమం ద్వారా డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళా–శిశు భద్రత, రోడ్డు భద్రతపై గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో భాగంగా ఎన్ డి పి ఎస్, హత్య, పోక్సో, అత్యాచార, రోడ్డు ప్రమాదాలు, ఎస్సీ,ఎస్టీ చట్టం కింద నమోదయ్యే కేసుల దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, కేసు డాక్యుమెంటేషన్, కోర్టు విచారణ విధానాలపై పోలీసు అధికారులకు పిపిటిల ద్వారా ప్రత్యేక శిక్షణ కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాస్ (డీటీసీ), జనయ్య (డీసీఆర్‌బీ), అంజయ్య (వికారాబాద్), ఎన్. యాదయ్య (తాండూరు), శ్రీనివాస్ (పరిగి), జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ, వివిధ విభాగాల అధికారులు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.

# ఫ్రాన్స్‌ను మట్టికరిపించిన స్పెయిన్



**టెక్సాస్, జూలై 15 (రాజముద్ర న్యూస్):** ఫిఫా ప్రపంచకప్-2026లో స్పెయిన్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్‌ను 2-0 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో స్పెయిన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత మరోసారి ఫైనల్‌లో అడుగుపెట్టడం స్పెయిన్‌కు ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన స్పెయిన్‌కు 22వ నిమిషంలో పెనాల్టీ లభించింది. యువ ఆటగాడు లామిన్ యమాల్‌పై ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీ ఇచ్చారు. ఆ అవకాశాన్ని మికెల్ ఒయర్‌జాబల్ సద్వినియోగం చేసుకుని తొలి గోల్ నమోదు చేశాడు. అనంతరం 58వ నిమిషంలో డానీ ఓల్మోతో చక్కటి పాస్‌ల మార్పిడి అనంతరం పెడ్రో పోరో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి స్పెయిన్ ఆధిక్యాన్ని 2--0కు పెంచాడు. ఫ్రాన్స్ తరఫున కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలే, మైఖేల్ ఒలిసే వంటి స్టార్ ఆటగాళ్లు బరిలో ఉన్నప్పటికీ స్పెయిన్ కట్టుదిట్టమైన రక్షణను ఛేదించలేకపోయారు. స్పెయిన్ డిఫెన్స్ ముందు ఫ్రాన్స్ దాడులు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో వరుసగా మూడో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరాలన్న ఫ్రాన్స్ ఆశలు గల్లంతయ్యాయి. 14 ఏళ్లుగా జట్టును నడిపిస్తున్న కోచ్ డిడియర్ డెషాంప్స్‌కు ఈ ఓటమి నిరాశ మిగిల్చింది. విజయం అనంతరం స్పెయిన్ ప్రధాన కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె జట్టు సమష్టి ప్రదర్శనను ప్రశంసించాడు. ఫ్రాన్స్ బలమైన దాడులను సమర్థంగా అడ్డుకోవడంలో ఆటగాళ్లు విజయవంతమయ్యారని పేర్కొన్నాడు. ఆదివారం న్యూజెర్సీలోని న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా-ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.

# డబ్ల్యూటీసీకి సెమీ ఫైనల్స్

## ఐసీసీ కీలక ప్రతిపాదనలు




**ఎడిన్‌బర్గ్, జూలై 15 (రాజముద్ర న్యూస్):** అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ, ఉత్కంఠ పెంచే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్స్‌ను ప్రవేశపెట్టడం, వన్డే ప్రపంచకప్‌లో జట్ల సంఖ్యను తగ్గించడం, కొత్త టోర్నీ విధానాలను అమలు చేయడం వంటి పలు ప్రతిపాదనలు ఐసీసీ వార్షిక సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం రెండేళ్ల చక్రంలో జరుగుతున్న వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాయింట్ల పట్టికలో తొలి రెండు జట్లు మాత్రమే ఫైనల్‌కు చేరుతున్నాయి. అయితే టోర్నీపై మరింత ఆసక్తి పెంచేందుకు ఇకపై తొలి నాలుగు జట్ల మధ్య సెమీఫైనల్స్ నిర్వహించి, విజేతలను ఫైనల్‌కు పంపే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మార్పు అమల్లోకి వస్తే డబ్ల్యూటీసీ మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వే జట్లను కూడా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో చేర్చేందుకు ఐసీసీ వర్కింగ్ గ్రూప్ కసరత్తు చేస్తోంది. టెస్ట్ క్రికెట్ విస్తరణకు ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. వన్డే ప్రపంచకప్‌లో కూడా మార్పులు ప్రతిపాదించారు. ప్రస్తుతం 14 జట్లతో నిర్వహిస్తున్న టోర్నీని 12 జట్లకు పరిమితం చేయడంతో పాటు 'సూపర్ సెవెన్' పేరుతో కొత్త దశను ప్రవేశపెట్టాలని ఐసీసీ పరిశీలిస్తోంది. 2027లో దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా నిర్వహించే ప్రపంచకప్ నుంచే ఈ మార్పులు అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే టీ20 ప్రపంచకప్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న 'సూపర్ ఎయిట్' దశను 'సూపర్ టెన్'గా మార్చే అంశంపైనా చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన మహిళా శరణార్థ క్రికెటర్లకు ఐసీసీ అండగా నిలిచింది. వారి కోసం రూపొందించిన అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించిన మండలి, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను పునర్వ్యవస్థీకరించింది. 2030 నాటికి ఐసీసీ అర్హత టోర్నీల్లో ఈ మహిళా క్రికెటర్లు పాల్గొనేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించే బాధ్యతను ఆ బృందానికి అప్పగించింది. ఈ టాస్క్‌ఫోర్స్‌లో ఇప్పటికే భారత క్రికెట్ నియంత్రణ మండలి, క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు ప్రతినిధులు ఉండగా, తాజాగా ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్ డాక్టర్ రోస్ రివాజ్, ఐసీసీ ప్రధాన కార్యనిర్వాహకుల కమిటీ సభ్యురాలు సారా కీన్‌లను కూడా చేర్చింది. మహిళా శరణార్థ క్రికెటర్లకు సమాన అవకాశాలు, ప్రాతినిధ్యం, పోటీ వాతావరణం కల్పించడమే ఈ టాస్క్‌ఫోర్స్ ప్రధాన లక్ష్యమని ఐసీసీ వెల్లడించింది.




# హర్మన్ గైర్హాజరీలో కెప్టెన్సీకి సిద్ధం

## స్మృతి మంధాన

**లండన్, జూలై 15 (రాజముద్ర న్యూస్):** భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో జట్టును నడిపించేందుకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన స్పష్టం చేసింది. ఎన్నో ఏళ్లుగా వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ నాయకత్వానికి అవసరమైన అనుభవాన్ని సంపాదించానని, అవకాశం వస్తే జట్టు పగ్గాలు చేపట్టేందుకు ఏమాత్రం వెనుకాడబోనని వెల్లడించింది. ఇంగ్లండ్‌పై లార్డ్స్ మైదానంలో జరిగిన ఏకైక టెస్టులో భారత్ చారిత్రక విజయం సాధించిన అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. హర్మన్‌ప్రీత్ స్థానంలో కెప్టెన్సీ చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అనే ప్రశ్నకు స్పందించిన స్మృతి, "అవును.. నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నాను. హర్మన్ అందుబాటులో లేకపోతే జట్టుకు నాయకత్వం వహించేందుకు ఎలాంటి సందేహం లేదు" అని స్పష్టం చేసింది. జట్టులో బాధ్యతలు పంచుకోవడం ప్రతి ఆటగాడి కర్తవ్యమని, నాయకత్వ బాధ్యతలు వచ్చినప్పుడు వాటిని సమర్థంగా నిర్వర్తించేందుకు తాను సిద్ధంగా ఉంటానని పేర్కొంది. ఇటీవల లార్డ్స్‌లో జరిగిన తొలి మహిళల టెస్టు మ్యాచ్‌ను స్మృతి ప్రత్యేకంగా గుర్తు చేసుకుంది. ఆ చారిత్రక వేదికపై భారత్ తరఫున ఆడటం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా నిలిచిందని తెలిపింది. "ప్రతి క్రికెటర్‌కు టెస్టు క్రికెట్ ఆడాలనేది ఒక కల. అలాంటి మ్యాచ్‌ను లార్డ్స్ వంటి చారిత్రక మైదానంలో ఆడటం మరింత ప్రత్యేకం. అంతేకాదు, ఆ మ్యాచ్‌లో జట్టు విజయంలో నేను కూడా కీలక పాత్ర పోషించడం ఎంతో ఆనందంగా ఉంది" అని చెప్పింది. ఆ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలు నమోదు చేసి భారత్ విజయంలో స్మృతి కీలక పాత్ర పోషించింది. నాయకత్వ పరంగా కూడా స్మృతి మంధానకు మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు ఆమె భారత మహిళల జట్టుకు 18 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు, నాలుగు వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించింది. మొత్తం 22 మ్యాచ్‌ల్లో 15 విజయాలు అందించి తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించింది. ముఖ్యంగా ఆమె సారథ్యంలో భారత్ ఆడిన నాలుగు వన్డేల్లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఓటమి చవిచూడకపోవడం విశేషం. ఈ గణాంకాలు భవిష్యత్తులో పూర్తి స్థాయి నాయకత్వ బాధ్యతలు చేపట్టే సామర్థ్యం తనకు ఉందనే విషయాన్ని మరోసారి చాటుతున్నాయి.

# జపాన్ ఓపెన్‌లో భారత షట్లర్లకు ఎదురుదెబ్బ

**టోక్యో, జూలై 15 (రాజముద్ర న్యూస్):** జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్లకు నిరాశ ఎదురైంది. ప్రతిష్ఠాత్మక టోర్నీ తొలి రౌండ్‌లోనే స్టార్ షట్లర్లు లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి ఓటమి పాలై నిష్క్రమించారు. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు ముందు కీలక సన్నాహక పోటీగా భావించిన ఈ టోర్నీలో భారత జట్టుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ గాయాల కారణంగా పోటీ నుంచి తప్పుకోవడం భారత శిబిరాన్ని మరింత నిరాశకు గురిచేసింది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ పద్నాలుగో ర్యాంకర్ లక్ష్య సేన్‌కు జపాన్‌కు చెందిన కోకి వతనాబే షాక్ ఇచ్చాడు. ఆరంభ గేమ్‌లో లక్ష్య పోటీ ఇచ్చినా కీలక సమయంలో వరుస తప్పిదాలు చేయడంతో 21-16 తేడాతో గేమ్‌ను కోల్పోయాడు. రెండో గేమ్‌లో వతనాబే దూకుడుగా ఆడి శక్తివంతమైన స్మాష్‌లతో లక్ష్యపై పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. కేవలం 38 నిమిషాల్లోనే 21-14తో రెండో గేమ్‌ను కూడా గెలిచి వరుస గేమ్‌లలో విజయం సాధించాడు. దీంతో ఈ సీజన్‌లో నిలకడ కోసం ప్రయత్నిస్తున్న లక్ష్య మరోసారి నిరాశతోనే టోర్నీకి వీడ్కోలు పలికాడు. మరో యువ భారత షట్లర్ ఆయుష్ శెట్టి థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ కున్లావుట్ విటిడ్సార్న్‌కు గట్టి పోటీ ఇచ్చినా విజయాన్ని అందుకోలేకపోయాడు. తొలి గేమ్‌ను స్వల్ప తేడాతో కోల్పోయిన ఆయుష్, రెండో గేమ్‌లో ప్రత్యర్థి సాధించిన ఐదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని అద్భుతంగా గెలిచి పోరును నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. అయితే చివరి గేమ్‌లో అదే జోరును కొనసాగించలేక 21-19, 23-25, 21-15 తేడాతో పరాజయం పాలయ్యాడు. గంటా 22 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ అభిమానులను ఉత్కంఠకు గురిచేసింది. మహిళల సింగిల్స్‌లోనూ భారత్‌కు ఆశించిన ఫలితం రాలేదు. ప్రపంచ ఇరవై నాలుగో ర్యాంకర్ ఉన్నతి హుడా చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ యు-హ్సున్ చేతిలో మూడు గేమ్‌ల పోరులో ఓడిపోయింది. తొలి గేమ్‌ను గెలిచిన ఉన్నతి తర్వాతి రెండు గేమ్‌లలో ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేక 21-16, 16-21, 15-21 తేడాతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే భారత అభిమానులకు కొంత ఊరటనిచ్చేలా స్టార్ షట్లర్ పీవీ సింధు తొలి రౌండ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించిన సింధు 21-14, 21-11 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు జపాన్ ఓపెన్‌లో భారత ఆశలన్నీ సింధుపైనే నిలిచాయి.




# అర్జెంటీనాపై వివాదం

## తొలగించాలని లక్షలాది సంతకాలతో పిటిషన్

**న్యూయార్క్, జూలై 15 (రాజముద్ర న్యూస్):** ఫిఫా ప్రపంచకప్-2026 సెమీఫైనల్‌కు ముందు డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వివాదంలో చిక్కుకుంది. జట్టుకు రిఫరీలు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్జెంటీనాను ప్రపంచకప్ నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ 75 లక్షల మందికిపైగా సంతకాలతో ఒక ఆన్‌లైన్ పిటిషన్ దాఖలైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ అంశం ప్రపంచ ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పిటిషన్‌లో ఫిఫా, రిఫరీలు లియోనెల్ మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా జట్టుకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపించారు. విజేతను ముందుగానే నిర్ణయిస్తే మిగతా జట్లు ఎందుకు పోటీపడాలని ప్రశ్నిస్తూ, అన్ని జట్లకు సమాన అవకాశాలు కల్పించాలంటే అర్జెంటీనాను టోర్నీ నుంచి తొలగించాలని అందులో కోరినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ ఆరోపణలపై ఫిఫా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అలాగే పిటిషన్‌లో చేసిన ఆరోపణలకు స్వతంత్రంగా ఎలాంటి ఆధారాలు వెలుగులోకి రాలేదు. ఇదిలా ఉండగా సెమీఫైనల్‌లో అర్జెంటీనా, ఇంగ్లండ్ జట్లు తలపడనున్నాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌లో ఈ రెండు జట్ల మధ్య పోటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. దక్షిణ అట్లాంటిక్‌లోని ఫాక్‌ల్యాండ్ దీవులు (అర్జెంటీనా భాషలో మాల్వినాస్) వివాదం కారణంగా ఇరు దేశాల మధ్య రాజకీయ విభేదాలు ఉన్న నేపథ్యంలో, ఆ ప్రభావం ఫుట్‌బాల్ మైదానంలోనూ తరచూ కనిపిస్తూ ఉంటుంది. ప్రత్యేకంగా 1986 ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్‌లో డిగో మారడోనా సాధించిన వివాదాస్పద 'హ్యాండ్ ఆఫ్ గాడ్' గోల్ ఇప్పటికీ అర్జెంటీనా-ఇంగ్లండ్ పోరాటాల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది. ఇప్పుడు మరోసారి ప్రపంచకప్ సెమీఫైనల్‌లో ఈ రెండు జట్లు తలపడుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల దృష్టి ఈ మ్యాచ్‌పైనే నిలిచింది. అయితే అర్జెంటీనాపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఫిఫా లేదా టోర్నీ నిర్వాహకులు అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు.





# ప్రభాస్ అంటే.. మాంచి భోజనం గుర్తుకొస్తుంది

## హీరోయిన్ పూజా హెగ్డే ఆసక్తికర వ్యాఖ్య

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు. ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యామ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు కూడా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంకేతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే కూడా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.





# వారణాసి కోసం..

## రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

# 'టాక్సిక్' నుంచి మరో పాటకు సిద్ధం





**హైదరాబాద్, జూలై 15 (రాజముద్ర న్యూస్):** దక్షిణాది సినీ ప్రేక్షకులతో పాటు ఉత్తరాది అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో కథానాయకుడు యశ్ నటిస్తున్న 'టాక్సిక్' ఒకటి. ప్రముఖ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన ప్రచార చిత్రాలు, పాత్రల పరిచయ పోస్టర్లు, ఇటీవల విడుదలైన 'తబాహి' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. తాజాగా ఈ చిత్ర సంగీతానికి సంబంధించిన మరో ఆసక్తికర సమాచారం వెలుగులోకి వచ్చింది. సంగీత దర్శకుడు విశాల్ ప్రస్తుతం అమెరికాలోని కాలిఫోర్నియాలో సంగీత కార్యక్రమంలో పాల్గొంటూనే 'టాక్సిక్' చిత్రంలోని మరో పాట స్వరరచన పనుల్లో నిమగ్నమయ్యారు. తన సామాజిక మాధ్యమ ఖాతాలో సంగీత రూపకల్పన జరుగుతున్న దృశ్యాన్ని పంచుకుంటూ, చిత్రంలోని నాలుగో పాటపై పని చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమాచారం బయటకు రావడంతో త్వరలోనే కొత్త పాట విడుదలయ్యే అవకాశం ఉందంటూ అభిమానులు ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'తబాహి' పాటలో యశ్, కియారా అద్వానీ మధ్య కనిపించిన నృత్యం, తెరపై వారి అభినయం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అదే స్థాయిలో రాబోయే పాట కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, విశాల్ వెల్లడించిన తాజా సమాచారం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. భారీ యాక్షన్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యశ్ రెండు భిన్నమైన పాత్రల్లో కనిపించనున్నట్లు ప్రచారం సాగుతోంది. అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీతో పాటు పలువురు విదేశీ నటీనటులు కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లాతో కలిసి విశాల్ కూడా కొన్ని పాటలకు సంగీతం అందించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ మాన్‌స్టర్ మైండ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ ఛాయాగ్రాహకుడు రాజీవ్ రవి చిత్రీకరణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 26న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వాటిపై సమంతకు మక్కువ

**హైదరాబాద్, జూలై 15 (రాజముద్ర న్యూస్):** టాలీవుడ్ ప్రముఖ నటి సమంత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకుంటున్న మార్పులు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఒకప్పుడు వంట చేయడం పెద్దగా రాదని, ఎక్కువ సమయం చిత్రీకరణలకే కేటాయించేదానినని చెప్పిన సమంత.. ఇప్పుడు సంప్రదాయ వంటకాలపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి చెందిన సంప్రదాయ వంటకాలను నేర్చుకుంటూ, వాటి తయారీలో సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. సన్నిహితుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం సమంత ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతూ రాయలసీమకు ప్రత్యేకమైన ఘాటు రుచులు, సంప్రదాయ మసాలాలతో చేసే వంటకాల తయారీని నేర్చుకుంటున్నారట. స్వయంగా వంటలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ, కొత్త వంటకాలపై అవగాహన పెంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు వంటగదికి దూరంగా ఉండే ఆమె ఇప్పుడు కిచెన్‌లో సమయం గడపడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల ఆమె జీవితంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా కుటుంబంతో ఎక్కువ సమయం గడిపే అవకాశం లభించిందని, ఈ సమయంలో గతంలో నేర్చుకోలేని విషయాలపై దృష్టి సారిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బయట కార్యక్రమాలను తగ్గించి విశ్రాంతి తీసుకుంటున్న సమంత, ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు సమాచారం. ఇంట్లో తయారయ్యే పోషకాహారంతో కూడిన సంప్రదాయ వంటకాలనే ఎక్కువగా నేర్చుకుంటున్నారని ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు. తెలుగు కుటుంబంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన తర్వాత తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక వంటకాలపై సమంతకు మరింత ఆసక్తి పెరిగిందని కూడా ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా రాయలసీమ వంటకాల ప్రత్యేక రుచిని ఆమె ఎంతో ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల కోసం స్వయంగా వంట చేసి వడ్డించడం ద్వారా ఆమె కొత్త అనుభూతిని ఆస్వాదిస్తున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం'చిత్రంలో కుటుంబానికి అండగా నిలిచే ఇంటి కోడలి పాత్రలో సమంత ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అదే తరహాలో నిజ జీవితంలోనూ కుటుంబంతో ఎక్కువ సమయం గడుపుతూ, సంప్రదాయ వంటకాలను నేర్చుకోవడం ద్వారా తన జీవితంలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తున్నారని అభిమానులు చర్చించుకుంటున్నారు

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com